REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 288 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 02-05-2025 | పేజీలు : 9

## అమరావతిలో భూముల విలువ పెరిగింది: సీఎం చంద్రబాబు

**ఆత్మకూరు, మే 1 (జనస్వరం) :** దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల అసంఘటిత కార్మికులు అనేక కష్టాలు పడ్డారని చెప్పారు. మేడే సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.వేలకోట్ల ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని వదులుకుని మరీ.. ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నాం. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.. నాలా చట్టాన్ని రద్దు చేశాం. ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నాం. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి కొంతభాగం వారికి ఇస్తున్నాం. ఆ రైతులను కోటీశ్వరులుగా మారుస్తున్నాం. ఇప్పుడు రాజధానిలో భూముల విలువ పెరిగింది. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తాం. అభివృద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారు" అని అన్నారు.



**సింగిల్ విండో విధానం కింద రుణాలు, సబ్సిడీలు :**

ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులతో నిర్వహించిన ముఖాముఖిలో సీఎం మాట్లాడుతూ.. "పరిశ్రమల స్థాపనకు నారంపేట ఎంతో అనుకూలం. కార్మికుల కోసం గుంటూరు, శ్రీసిటీ, కర్నూలులో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తాం. ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమలకు సౌకర్యాలు కల్పిస్తాం. 173 ఎకరాల్లో ప్రారంభించిన ఎంఎస్ఎంఈల్లో 338 పరిశ్రమలు వస్తాయి. అమరావతిలో భూములు ఇచ్చిన వారికి ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం. విశాఖ, రాజమండ్రి విజయవాడ, తిరుపతి, అనంతపురంలో రీజినల్ హబ్‌లు ఏర్పాటు చేస్తాం. సింగిల్ విండో విధానం కింద రుణాలు, సబ్సిడీలు ఇస్తాం. పరిశ్రమల్లో ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రభుత్వం సహకరిస్తుంది.

**ఆ బాధ్యత ఎమ్మెల్యేలదే :**

పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమలు తెచ్చే బాధ్యత ఎమ్మెల్యేలదే. పారిశ్రామికవేత్తలను ఎవరూ బెదిరించకుండా ఎమ్మెల్యేలు చూసుకోవాలి. ఒక్కో పార్కుకు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల మేర నిధులిస్తాం. ఐదు నుంచి పదెకరాల్లో నానో పార్కులు ఏర్పాటు చేస్తాం. రైతులను పారిశ్రామివేత్తలను చేయడమే మా లక్ష్యం. మహిళలు కూడా పరిశ్రమలు పెట్టి ఆదాయం ఆర్జించాలి. త్వరలో దగదర్తిలో విమానాశ్రయం ప్రారంబిస్తాం. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం. ఆత్మకూరుకు సోమశిల జలాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ఆత్మకూరులో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తాం. ప్రతి నియోజకవర్గానికి ఒక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం" అన్నారు.



## శ్రామికులతోనే దేశ ప్రగతి

(లోపలిపేజీలో)

# అమరావతికి జయం

- 2.0కు సర్వం సిద్ధం
- నేడు ప్రధాని చేతుల మీదుగా పనులకు శ్రీకారం
- రూ.49,040 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన
- మరో రూ.8 వేల కోట్ల పనులకూ పచ్చజెండా
- మధ్యాహ్నం 2.55కు గన్నవరం ఎయిర్‌పోర్టుకు
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడికి
- వేదికపై మోదీ, బాబు, పవన్ సహా 14 మంది
- రెండున్నర గంటల పాటు ప్రధాని పర్యటన
- సభకు వచ్చే ప్రజల కోసం 8 వేల బస్సులు
- అడ్డంకులు అధిగమించి అడుగు ముందుకు
- నాడు రాజధాని నిర్మాణానికి ప్రధాని శ్రీకారం
- నేడు అదే మోదీ చేతుల మీదుగా పునరుద్ధరణ
- జగన్ కారణంగా ఐదేళ్ల కాల హరణం
- కూటమి రాగానే మళ్లీ అమరావతిపై దృష్టి
- ఇక పరుగు తీయనున్న రాజధాని పనులు

**అమరావతి, మే 1 (జనస్వరం) :** ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం అమరావతి నిర్మాణ పనులకు మోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు. రూ.49,040 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు మరో రూ.8 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ గన్నవరం రానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. ప్రధాన వేదికపై పరిమితంగా 14 మంది వీఐపీలు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలి వస్తున్నారు. వారి కోసం 8 వేల బస్సులు ఏర్పాటు చేశారు. రాజధాని చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాలకే మొత్తం 6,600 బస్సులు కేటాయించారు.

**మంత్రుల బృందం పర్యవేక్షణ :**

ప్రధాని సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రుల బృందం నిరంతరాయంగా పర్యవేక్షిస్తోంది. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వెల్లడించింది. పర్యవేక్షణకు నియమితులైన పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్‌తో కూడిన మంత్రుల బృందం గురువారం సభావేదిక ప్రాంగణంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లను సమీక్షించింది. అనంతరం ప్రధాన సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని పర్యటనకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలి రానున్నారని, వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. ప్రతి బస్సుకు ఒక ప్రభుత్వ అధికారిని ఇన్‌చార్జిగా పెట్టడంతో పాటు 25 బస్సులకు ఒక ప్రత్యేక ఇన్‌చార్జి అధికారిని నియమించినట్టు చెప్పారు. ఎక్కడా ఆటంకాలు కలగకుండా సభాస్థలికి చేర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. బస్సులు బయలుదేరే సమయంలోనే అల్పాహారం, తాగునీరు ఇవ్వడంతో పాటు దారి మధ్యలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పార్కింగ్ ప్రాంతాల్లో కూడా భోజన వసతి కల్పించామని, సభానంతరం తిరిగి గమ్యస్థానాలకు బయలుదేరే ముందు రాత్రి భోజనం కూడా అందిస్తామని అన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాల ప్రజలు సుమారు 34 వేల ఎకరాలను ఇచ్చారని, వారందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు రాజధాని రైతులకు ఆహ్వానాలను అందించామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని కార్యక్రమానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో అద్భుతమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి అమరావతి రాజధానిని నాశనం చేసిందన్నారు. తిరిగి అమరావతి పనులను ప్రారంభించుకోవడం రాష్ట్రమంతా గర్వించదగ్గ పరిణామమన్నారు.

**రెండున్నర గంటల పాటు మోదీ పర్యటన**

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి రానున్న మోదీ.. రాజధాని అమరావతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం 5.20కి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు. మొత్తంగా మోదీ రెండున్నర గంటలు రాష్ట్ర పర్యటనలో ఉంటారు.

**రూ.57,962 కోట్ల ప్రాజెక్టులు :**

రాజధాని అమరావతిలో రూ.49,040 కోట్ల వ్యయంతో 74 ప్రాజెక్టుల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు భవనాలతో పాటు ఇతర ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తారు. రాజధాని పనులతో పాటు మరో రూ.8 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రూ.1,459 కోట్లతో కృష్ణా జిల్లా నాగాయలంకలో డీఆర్‌డీవో చేపట్టే క్షిపణి ప్రయోగ కేంద్రానికి, రూ.100 కోట్లతో విశాఖలో డీపీఐఐటీ చేపట్టే యూనిటీ మాల్‌కు, రూ.293 కోట్లతో గుంతకల్లు వెస్ట్-మల్లప్ప గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, రూ.3,176 కోట్లతో ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టే 6 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభిస్తారు. రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ట్రిప్లింగ్, డబ్లింగ్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు.




## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 02 మే 2025,**

**తిథి : శుద్ధ పంచమి (ఉ.09:18వ.కు),**

**నక్షత్రం : ఆరుద్ర (మ.01:05వ.కు)**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:10ల తె.04:58**

**రాహుకాలం : ఉ.10:30ల మ.12:04,**

**యమగండం : ఉ.03:14ల సా.04:49,**

**వర్జ్యకాలం : 03తా తె.00:45ల తె.02:29,**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 02 మే 2025,**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:42**

**సూర్యోదయం : ఉదయం గం. 05:56**

**జొహార్ : మధ్యాహ్నం గం. 12:17**

**అసర్ : సాయంత్రం గం. 03:26**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:37**

**ఇష : రాత్రి గం. 07:53**




జనస్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ ఏంటిది? రాజకీయాలకు ఇదా సందర్భం?

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికార యావతో అల్లాడిపోతున్నట్లు కనిపిస్తున్నది. 2024 ఎన్నికలలో ఓటమి తరువాత, ఆయన పార్టీ అధినేతగా, పులివెందుల ఎమ్మెల్యేగా సరిపెట్టుకోలేకపోతున్నారు. ఎప్పుడెప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కేద్దామా అన్న ఆత్రంతో ఉన్నట్లు కనిపిస్తున్నది. అందుకోసం ఆయన ప్రజలతో మమేకం కావడం, ప్రజా సమస్యలపై పోరాడటం వంటి మార్గాలను కాకుండా అడ్డదార్లను ఎన్నుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలను రెచ్చగొట్టడం, సమాజంలో చీలికలలు తీసుకు వచ్చి, అశాంతిని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. అందుకే ఆయన ప్రజలలోకి రావడానికి ఎంచుకుంటున్న సమయం, సందర్భం వివాదాస్పదంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు, మరణాలు సంభవించినప్పుడు, తమ పార్టీ నేతలు ఎవరైనా గతంలో చేసిన తప్పులు, నేరాలలో అరెస్టైనప్పుడు మాత్రమే ఆయన బయటకు వస్తున్నారు. ఆ వచ్చిన సమయంలో కూడా బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం కంటే.. తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసి.. తాను మళ్లీ అధికారంలోకి రాగానే.. అంటూ హెచ్చరికలు చేయడానికే పరిమితమౌతున్నారు. తాజాగా సింహాచలంలో జరిగిన దురదృష్టకర సంఘటనలో ఏడుగురు మరణించిన సంగతి తెలిసిందే. వెంటనే జగన్ బాధిత కుటుంబాల పరామర్శ అంటూ సింహాచలంలో వాలిపోయారు. అయితే జగన్ బాధిత కుటుంబాలను పరామర్శించడానికి అక్కడకు చేరుకోవడానికి ముందే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు పాతిక లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించేసింది. అలాగే బాధిత కుటుంబాలలో ఒకరికి దేవాదాయ శాఖలో ఔట్ సోర్సింగ్ విధానం



ద్వారా ఉద్యోగం ఇవ్వనున్నట్లు కూడా పేర్కొంది. దీంతో జగన్ తన స్క్రిప్ట్ ను ఒకింత సవరించుకున్నారు. ప్రభుత్వాన్ని నిలదీయడానికి బాధిత కుటుంబాలకు ఇచ్చిన నష్టపరిహారం సరిపోదని, గతంలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తాను కోటి రూపాయలు నష్టపరి

## ఎడిటోరియల్

హారం ప్రకటించాననీ, ఇప్పుడు సింహాచలం ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు కూడా అంతే పరిహారం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం అలా ఇవ్వకపోతే.. తాను అధికారంలోకి వచ్చిన తరువాత బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం తాను ఇస్తానని కూడా ప్రకటించేశారు. ఇక్కడ ఆయన మరచిపోయిందేమిటంటే.. ఎల్జీ పాలిమర్స్ ఘటన పూర్తిగా మానవ తప్పిదం, ఆ కంపెనీ నిర్లక్ష్యం. కానీ సింహాచలంలో జరిగింది పూర్తిగా వేరు. ఇక్కడ భారీ వర్షం కారణంగా గోడ కూలి భక్తులు మరణించారు. ఈ విషయాన్ని విస్మరించి జగన్ రాజకీయ లబ్ధి కోసం ఏవేవో చెబుతున్నారు. మేము వచ్చాకా అంటూ తన భుజాలు తానే చరుచుకుంటున్నారు. అయితే నెటిజనులు మాత్రం జగన్ ను ముందు విజయవాడ బుడమేరు ముంపు సమయంలో ప్రకటించిన కోటి రూపాయల విరాళం మాటేమిటని నిలదీస్తున్నారు. అయినా జగన్ సింహాచలం వచ్చింది బాధితులను పరామర్శించి ఓదార్చడానికా లేక రాజకీయం చేయడానికా అని ప్రశ్నిస్తున్నారు.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## మాటకు.. మాట



# డిప్యూటీ సీఎంకు పంగ'నామం'

- రాజధాని పునర్నిర్మాణం ఆహ్వాన పత్రంలో పవన్ పేరేదీ?
- తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన జనసేన కార్యకర్తలు
- మళ్లీ పేరు చేర్చి పత్రాలు ముద్రణ

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం ఆహ్వానపత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు ముద్రించకపోవడం వివాదాస్పదంగా మారింది. దీనిపై జనసేన శ్రేణులు సోషల్ మీడియాలో విరుచుకుపడడంతో మళ్లీ ఆయన పేరును చేర్చి ఆహ్వాన పత్రాలు ముద్రించారు. అయితే ఇప్పటికే 90శాతం ఆహ్వాన పత్రాల పంపిణీ జరిగిపోయింది.

**మోదీ, బాబు పేర్లు మాత్రమే..!**

ఈ నెల 2న వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణం పేరుతో భారీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి సంబంధించి సీఆర్డీఏ నాలుగు పేజీల ఆహ్వానపత్రాన్ని ముద్రించి అందరికీ పంపిణీ చేసింది. మొదటి పేజీ, చివరి పేజీలో అమరావతి



అమరావతి ఆహ్వాన పత్రిక

డిజైన్లు, ప్రభుత్వ రాజముద్ర, 2వ పేజీలో ఇంగ్లిష్, 3వ పేజీలో తెలుగులో ఆహ్వాన పత్రాన్ని ముద్రించారు. అందులో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు పేర్లు మాత్రమే ముద్రించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేరు లేదు. ఈ ఆహ్వానపత్రికలను ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వీఐపీలు, వీవీఐపీలు, ముఖ్యులకు పంపించారు. ఆహ్వానపత్రికలో పవన్ పేరు లేదని ఆలస్యంగా గుర్తించిన జనసేనపార్టీ మిన్నకుండిపోయింది. పవన్ కళ్యాణ్ కూడా సర్దుకుపోయారు. అయితే జనసేన శ్రేణులు మాత్రం తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ తీరుపై నిప్పులుచెరిగారు. తమ నేతను కరివేపాకులా తీసి పారేశారంటూ ఆవేదన వెళ్లగక్కారు. తమ పార్టీ లేకపోతే చంద్రబాబు సీఎం అయ్యేవారు కాదని, తమ నేతకే పంగనామాలు పెడతారా? అంటూ పోస్టులు పెట్టారు. దీనికి టీడీపీ శ్రేణులూ కౌంటర్ ఇచ్చాయి. రెండుపార్టీల మధ్య సోషల్‌మీడియా వార్ జరుగుతోంది.

**మరిచిపోయినట్టు నటించి దిద్దుబాటు చర్యలు**

ఇది చిలికిచిలికి గాలివానలా మారుతోందని గుర్తించిన టీడీపీ పెద్దలు పేరు మరిచిపోయినట్టు నటించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. దీంతో సీఆర్డీఏ అధికారులు ఆహ్వానపత్రంలో మొక్కుబడిగా పవన్ పేరు చేర్చి మళ్లీ ముద్రించి విడుదల చేశారు. అయితే ఇప్పటికే 90శాతం పత్రికల పంపిణీ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనతో కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ప్రాధాన్యంపై సర్వత్రా చర్చ మొదలైంది. పవన్ కళ్యాణ్.. చంద్రబాబుకు తలొగ్గి అన్ని విషయాల్లో బేషరతుగా మద్దతు ఇస్తున్నా ప్రభుత్వంలో ఆయనకు ఏమాత్రం విలువ లేదని జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## వైసీపీకి ఇది చెప్పుదెబ్బే.. కాదా?



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను ప్రధాని మోడీ చేతనే కూటమి ప్రభుత్వం అట్టహాసంగా పునః ప్రారంభిస్తుండటం, దానిని 5 ఏళ్ళు పాడుబెట్టిన మాజీ సీఎం జగన్ రెడ్డికి చెప్పుదెబ్బ వంటిదే అని భావించవచ్చు. ఆహ్వానపత్రికలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు ముద్రించకపోవడంపై నీచ రాజకీయాలు చేస్తున్న వైసీపీకి మరో చెప్పుదెబ్బ కొట్టిన్నట్లు ఈ కార్యక్రమానికి జగన్ రెడ్డిని కూడా కూటమి ప్రభుత్వం ఆహ్వానించింది. జగన్, వైసీపీ నేతలు, వారి సొంత మీడియా అమరావతి పేరుతో ఎంత నీచ రాజకీయాలు చేస్తున్నప్పటికీ, ప్రోటోకాల్ ప్రకారం జగన్ రెడ్డిని ఆహ్వానించి సీఎం చంద్రబాబు నాయుడు ఆనవాయితీని గౌరవించడం అభినందనీయం. అమరావతి పేరు పలికే అర్హత కూడా కోల్పోయిన జగన్ అండ్ కో ఈ సభకు వస్తారని అనుకోలేం. వస్తే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల ఐక్యతని కళ్ళారా చూసి తట్టుకోవడం కష్టం. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను పొగుడుతుంటే చిరునవ్వుతో విని భరించడం ఇంకా కష్టం. ముఖ్యంగా తాను ధ్వంసం చేసిన అమరావతిని ప్రధాని మోడీ చేతుల మీదుగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తుంటే చూసి తట్టుకోవడం చాలా చాలా కష్టం. కనుక ఈ సభకు జగన్ వస్తేనే ఆశ్చర్యపోవాలి.

మే 2న (గురువారం) అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోడీ ఈసారి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్ళతో సరిపెట్టకుండా రాష్ట్రంలో రూ.57,962 కోట్లు విలువగల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయబోతున్నారు.

**రూ. 3,176 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు :**

1. నాగాయలంకలో క్షిపణి పరీక్షా కేంద్రం,
2. విశాఖలో రుషికొండ బీచ్ సమీపంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్,
3. గుంతకల్ పశ్చిమ నుంచి మల్లప్ప గేట్ వరకు రైల్వే ప్రాజెక్ట్.

**రూ.3,680 కోట్లతో పూర్తిచేసిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు :**

1. కాజీపేట-విజయవాడ జాతీయ రహదారిలో 3వ లైన్,
2. పాణ్యం-కృష్ణమ్మ కొన-బుగ్గనపల్లి సెక్షన్ రైల్వే లైన్.

జగన్ 5 ఏళ్ళ విధ్వంస పాలన చూసిన తర్వాత మళ్ళీ ఎప్పటికైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తేరుకొని గాడిన పడుతుందా? లక్షల కోట్ల అప్పులు తీరేదెలా?అని సామాన్య ప్రజలు సైతం ఆవేదన చెందేవారు. కానీ సీఎం చంద్రబాబు నాయుడు తన తెలివితేటలు, పరపతి, అవకాశాలు అన్నిటినీ పూర్తిస్థాయిలో వినియోగిస్తూ కేవలం 10 నెలల్లోనే ఇన్ని కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు స్వాంతన కలిగిస్తున్నారు. కనుక ఇదే వేగంతో ముందుకు సాగితే 2029 నాటికల్లా ఆంధ్రప్రదేశ్ దేశంలో మళ్ళీ అగ్రస్థానంలో నిలుస్తుంది. కనుక ఇకనైనా వైసీపీ నేతలు, వారి అధినేత అమరావతిని, దానిని నిర్మిస్తున్న సీఎం చంద్రబాబును చూసి ఏడ్వడం మానుకొని, ప్రజలు మనకి కూడా ఇటువంటి గొప్ప అవకాశం ఇచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయామే అని ఏడ్వాలి.

# వయోవృద్ధులకు కూటమి సర్కార్ వెసులుబాటు

- డిజిటల్ రూపంలో గుర్తింపు కార్డులు
- జారిచేయనున్న సచివాలయాలు

**పులివెందుల, మే 1 (జనస్వరం) :** వయోవృద్ధులకు కూటమి సర్కార్ పలు రకాల సేవలపై వెసులుబాటు కల్పిస్తోంది. ఏపీలోని కూటమి ప్రభుత్వం వయోవృద్ధుల కోసం సీనియర్ సిటిజన్ కార్డులను డిజిటల్ రూపంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందిస్తోంది. 60 ఏళ్లు నిండిన పురుషులు, 58 ఏళ్లు నిండిన మహిళలు ఈ కార్డు పొందడానికి అర్హులు. కార్డుపై బ్లడ్ గ్రూప్, అత్యవసర సంప్రదింపు నంబర్లు ఉంటాయి. పాస్పోర్ట్ ఫోటో, ఆధార్, బ్యాంకు ఖాతా, కుల ధ్రువపత్రంతో రూ.40 చెల్లించి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్డుతో ప్రభుత్వ పథకాల్లో రాయితీలు, రవాణా సౌకర్యాలు, బ్యాంకింగ్ ప్రయోజనాలు పొందవచ్చు. వయోవృద్ధుల గౌరవాన్ని కాపాడేందుకు.. వారికి అనేక సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సీనియర్ సిటిజన్ కార్డులను డిజిటల్ రూపంలో అందించే సేవలను ప్రారంభించింది. ఈ గుర్తింపు కార్డు 60 ఏళ్లు నిండిన పురుషులకు.. 58 ఏళ్లు నిండిన మహిళలకు జారీ చేయబడుతుంది. ఈ కార్డును ఉపయోగించి వృద్ధులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో అనేక రకాల సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సీనియర్ సిటిజన్ కార్డు కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాదు, ఇది అనేక ముఖ్యమైన సమాచారాలను కలిగి ఉంటుంది. కార్డుపై లబ్ధిదారుల బ్లడ్



గ్రూప్, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లను ప్రత్యేకంగా పొందుపరుస్తారు. ఏదైనా ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ వివరాలు తక్షణ సహాయం అందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డును పొందడం చాలా సులభం. అర్హులైన వృద్ధులు తమ పాస్పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల ధ్రువపత్రం వంటి అవసరమైన సమాచారంతో గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించాలి. నామమాత్రపు రుసుము కేవలం రూ. 40 చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్ కార్డుతో అనుసంధానం చేయబడిన మొబైల్ ఫోన్ను వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే, కార్డు జారీ ప్రక్రియ కేవలం పది నిమిషాల్లోనే పూర్తవుతుంది. సీనియర్ సిటిజన్ కార్డు వయోవృద్ధులకు అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో రాయితీలను పొందడానికి ఇది ఒక ముఖ్యమైన గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. తరచూ ఇతర గుర్తింపు కార్డులను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. వృద్ధాశ్రమాల్లో సేవలు పొందడానికి ఈ కార్డు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం రాయితీ.. రైళ్లలో దిగువ బెర్త్ ను పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. బ్యాంకింగ్, పోస్టాఫీసుల్లో డిపాజిట్లపై సాధారణ వడ్డీ రేట్ల కంటే ఎక్కువ వడ్డీని పొందవచ్చు. కోర్టు కేసుల విచారణ తేదీల కేటాయింపు, పన్ను మినహాయింపు వంటి విషయాల్లో కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఈ విధంగా.. సీనియర్ సిటిజన్ కార్డు వృద్ధుల జీవితాన్ని సులభతరం చేయడానికి.. వారికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించడానికి ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది.

## విజయవాడ ఆటోనగర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటోనగర్‌లోని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ కార్మికులు, టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత టీఎన్టీయూసీ జెండాను ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురామ్, మాజీ అర్బన్ టీఎన్టీ యూసీ అధ్యక్షుడు బోయిన సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీరఘురామ్ మాట్లాడుతూ, "పారిశ్రామిక విప్లవం అనంతరం కార్మికుల సంక్షేమం కోసం సాగిన పోరాటాల ఫలి తంగా ప్రపంచవ్యాప్తంగా మేడేను ఘనంగా జరుపుకుంటున్నాం" అని గుర్తు చేశారు. "కార్మికులు ఐక్యతతో ఉన్నప్పుడు మాత్రమే వారి అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వం వారి హక్కులను పరిర క్షించేందుకు చట్టాలను తీసుకువచ్చిందని" వివరించారు. ఇప్పట్లోనే అభివృద్ధి మార్గంలో దూసుకు పోతున్న భారతదేశం, ఆ దిశగా మన రాష్ట్రం కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వేగంగా ముందుకు సాగుతోందని శ్రీరఘురామ్ పేర్కొన్నారు. "నూతన సాంకేతికతతో శ్రామిక వర్గం తమ శ్రమకు కొత్త రూపు ఇచ్చుకుంటోంది. ఆటోవర్కర్ల నుంచి కార్పొరేట్ కంపెనీల వరకు శ్రామిక ఐక్యత కీలకం" అని హితవు పలికారు. ఇక శుక్రవారం అమరావతిలో జరగ నున్న మైలురాయి కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, "ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కలిసి అమరావతి పనుల పునఃప్రారంభానికి శంకుస్థాపన చేయబోతున్నారు. గత ఐదేళ్ల విధ్వంసం నుంచి బయటపడి, మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లేందుకు ప్రజలు ఘనమైన మద్దతును ఇచ్చారు" అని అన్నారు. 50 వేల కోట్ల రూపాయల విలువైన టెండర్లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, రేపటి శంకుస్థాపనతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయని చెప్పారు. "భారతదేశం మాత్రమే కాదు, ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించేలా అమరావతిని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారు" అని నెట్టెం శ్రీరఘురామ్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అమరావతికి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి గన్నే ప్రసాద్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, రాష్ట్ర లీగల్ సెల్ నేత యెర్నేని వేదవ్యాస్, డివిజన్ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు, నాయకులు గోపు సత్యనారాయణ, శొంఠి శివరామ్‌ప్రసాద్ గౌడ్, పొన్నం రవికుమార్, పామర్తి కిశోర్‌బాబు, బత్తుల దుర్గారావు, వాకా వెంకటేశ్వరరావు గౌడ్, జాస్తి సురేష్, యార్లగడ్డ రమేష్, దేవరపల్లి ఆంజనేయులు, పాలడుగు దుర్గారావు, వల్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

## విజయవాడలో టీడీపీ - జనసేన సమన్వయ భేటీ



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** టీడీపీ - జనసేన కోఆర్డినేషన్ కమిటీ గురువారం విజయవాడలో భేటీ అయింది. ఈ సమావేశంలో జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు ఎటువంటి విభేదాలు లేకుండా సమన్వయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ భేటీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నాయకులు కె.కె.సత్యనారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెండు పార్టీల నాయకులు కలిసి కట్టుగా పని చేయాలని పల్లా శ్రీనివాస్ సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి టీడీపీ - జనసేన సమన్వయంతో శక్తివంతంగా కృషి చేయనున్నట్టు నాయకులు తెలిపారు.

## పింఛన్ పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్‌లో సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి అనూష స్థానిక ప్రజలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అంతేకాక, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) చేస్తున్న సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ఆయన రూపొందించిన ప్రణాళికలను ప్రజలకు వివరించారు. స్థానిక శుభ్రతపై కూడా ఆమె అవగాహన కల్పించారు. ప్రజలు స్థానిక అధికారులు, కార్పొరేషన్ సిబ్బందికి సహకరిస్తూ చెత్తను రోడ్లపై పడేయకుండా డస్ట్‌బిన్‌లను వినియోగించుకోవాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ శ్రామిక దినోత్సవ వేడుకలు



**ఏలూరు, మే 1 (జనస్వరం) :** అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని ఏలూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు ఐఎఫ్టీయూ కార్యాలయం, వన్‌టౌన్ మార్కెట్ సెంటర్, మెయిన్ బజార్ కన్నయ్య పార్క్ వద్ద హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, "కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, వారి శ్రమకు తగిన గుర్తింపు రావాలని" ఆకాంక్షించారు. "కార్మికుల శ్రమకు విలువ పెట్టాలి. శ్రమశక్తే అభివృద్ధికి పునాది" అని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మేడే సందర్భంగా కార్మిక హక్కులకు ఎదురవుతున్న ప్రమాదాలను ఆయన ఎత్తి చూపారు. "వేతనాలు, బోనస్లు, పెన్షన్లు కోతకు గురవుతున్నాయి. రిటైర్మెంట్ వయసు పెంచుతూ కార్మిక హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని చెప్పారు. ముఖ్యంగా సమ్మె హక్కుపైనా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "మేం కూడా మనుషులమే. మా శక్తికి పరిమితులు ఉన్నాయి. రోజు పొడవునా దోచుకున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం మానవ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచింది" అని రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. 24 గంటల్లో 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు వికాసానికి సాధించుకోవడం కార్మిక పోరాటానికి ప్రతీక అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో హమాలీ వర్కర్లు పాల్గొన్నారు. "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి... మేడే వర్ధిల్లాలి..." అంటూ శ్రామిక సంఘ నాయకులు నినదించారు.

# మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడుదాం

- సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలనీ సుప్రీం తీర్పును అమలు చేయాలి
- మేడే సందర్బంగా ఎంసీపీఐ (యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్
- అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్ కుమార్




**శేరిలింగంపల్లి, మే 1 (జనస్వరం) :** మేడే సందర్భంగా మియాపూర్ ప్రాంతంలో ఎంఎ నగర్, స్టాలిన్ నగర్, నడిగడ్డ తాండ, ఓంకార్ నగర్, పీఎన్ నగర్ టీఎన్ నగర్ మియాపూర్ విలేజ్, కాలనీలో పార్టీ జెండాలను ఎంసీపీఐ (యూ) మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ అధ్యక్షతన ఆవిష్కరించారు. అనంతరం ఎంసీపీఐ (యూ), గ్రేటర్ కార్యదర్శి వైదమ్ శెట్టి రమేష్, అఖిల భారత కార్మికుల సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ నేడు కూడా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాలు కార్మిక వర్గాలు, ఉద్యోగ వర్గాలు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక హక్కులను, చట్టాలను కాలరాసేందుకు అవసరమైన విధానాలను పాటిస్తూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత పని గంటల సమయాలను తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని చట్టాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. అనేక పెట్టుబడిదారీ దేశాలలోని వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పేద మధ్యతరగతి వర్గాలు నిరసన ప్రదర్శనలు చెబుతున్నారు కాబట్టి మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలని డిమాండ్ చేశారు. రాష్టంలో కోటి 20లక్షల మంది కార్మికులకు ఉద్యోగం భద్రత లేదని వారందరికీ ఉద్యోగం భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం 7 కోట్ల కార్మికులకు మాత్రమే ఉద్యోగ భద్రత, తగిన వేతనాలతో జీవిస్తున్నారని, మిగతావారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం, కోర్టుల గురించి గొప్పలు వల్లించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'సమాన పనికి సమాన వేతనం' అనే సుప్రీం తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చివరికి కార్మికులు జీవించడానికి సరిపడే వేతనాలు ఇవ్వాలని పోరాడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలలో, 15 చట్టాలను ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ ఆమోదించి అమలు చేయడం వల్ల కార్మికులు యజమానులకు కట్టు బానిసలుగా మార్చేసారన్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులైన సమ్మె, వేతనాల గురించి బేరసారాలు లేకుండా చేయడం, అధిక పని గంటలు, నియమిత కాల పరిమితి గల ఎంప్లాయిమెంట్ ఉండే విధంగా నిబంధనలు, పరిశ్రమల మూసివేత, కార్మికుల తొలగింపునకు సులభతర అవకాశాలను కోడ్స్ పొందుపర్చారన్నారు. ఇది పూర్తిగా కార్మికుల హక్కులను హరించడమే అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదన్నారు. మేడే స్ఫూర్తిగా పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, కుంభం సుకన్య, తాండ్ర కళావతి, అంగడి పుష్ప, పల్లె మురళి, ఏఐటీయూ గ్రేటర్ నాయకులు కర్ర దానయ్య, జి శివాని, పార్టీ డివిజన్ నాయకులు, డి మధుసూదన్, ఎండి సుల్తానా బేగం, జి లలిత, డి నరసింహ, రజియా బేగం, రాములు, కే రాజు, శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, ఇసాక్, శ్రీనివాస్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ

## హంపోలి గ్రామంలో వ్యక్తి ఆత్మహత్య



**కుబీర్, మే 1 (జనస్వరం) :** హంపోలి గ్రామంలో చౌరే శ్రీకాంత్ (35) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ అందించిన సమాచారం ప్రకా రం కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీకాంత్ చికిత్స తీసుకున్నా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఆరోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన ఆయన, బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి భార్య ప్రేమలతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారని ఎస్సై తెలిపారు.

## సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

- గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- రూరుల్ ఎస్సై శంకర్



**భైంసా, మే 1 (జనస్వరం) :** సైబర్ నేరాల పట్ల ప్రజలు విద్యార్థులు యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఎస్సై శంకర్ అన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని ఫోన్‌లలో ఓటీపీ, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడటం, బాల్య వివాహాల చేయడం, వారిని ప్రోత్సహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు, మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాల సరఫరా, విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై శంకర్ పేర్కొన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ అభివృధి కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని శాంతిభద్రతలను కాపాడటంలో తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వడానికి, ఇతర విషయాల్లో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కోరారు.

# యువత రాజకీయాల్లో ఎదగడానికి అవకాశం ఉన్న ఏకైక రాజకీయ సంస్థ కాంగ్రెస్ పార్టీ..



**శేరిలింగంపల్లి, మే 1 (జనస్వరం) :** యువత రాజకీయాల్లో ఎదగడానికి అవకాశం ఉన్న ఏకైక రాజకీయ సంస్థ కాంగ్రెస్ పార్టీ అని శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. దార్శనిక నాయకుడు సేవకు నిబద్ధత తెలంగాణ ప్రభుత్వానికి సీఎంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, రాజకీయాల నాణ్యత మెరుగుపడుతోందన్నారు. గురువారం టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ కేఎల్సిసి కన్వెన్షన్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఏఐసీసీ సభ్యులు చల్లా వంశీ చంద్ రెడ్డి, మధు యాష్కీ గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జులు, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులతో కలిసి అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని, మాట ఇచ్చాం, చేసి చూపిస్తామని, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా తాము ప్రజలకు, మైనార్టీలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, మీతో నడుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవ ఎప్పటికీ మరువలేనిదని, కాంగ్రెస్ పార్టీ ముఖచిత్రం, భారత రాజకీయాల భవిష్యత్తు, దేశం పట్ల దార్శనికత కలిగిన, రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ప్రజల కోసం నిజాయితీగా పని చేసే రాహుల్ గాంధీ రాజకీయాల్లో మాకు ఆదర్శం, స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ఇక మన రాష్ట్రానికి వస్తే మనకు శక్తివంతమైన నాయకత్వం ఉందని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎల్లప్పుడూ కార్యకర్తకు అండగా ఉంటూ, కాంగ్రెస్ క్యాడర్‌కు మద్దతు ఇచ్చి, ప్రోత్సహించే విధంగా ముందుకు సాగుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపునకు అనుగుణంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తూ, పార్టీ పిలుపును స్వీకరించి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌లో గుజరాత్, మహారాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**జాతి ప్రగతిలో ఆ 2 రాష్ట్రాలు కీలకం :గవర్నర్**



**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** మహారాష్ట్ర, గుజరాత్ ప్రజలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. జాతి ఆర్థిక ప్రగతిలో ఈ రెండు రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ ఆర్థిక రాజధానిగా మహారాష్ట్ర నిలిస్తే, దేశానికి గుజరాత్ పటిష్టమైన నాయకత్వం అందించిందని చెప్పారు. దేశ సమగ్రతను పెంపొందిస్తూ జాతీయ భావ వ్యాప్తికి ఏక్ భారత్ – శ్రేష్ట భారత్ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఆ రెండు రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణ, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవరథ్ పంపిన వీడియో సందేశాలను ప్రదర్శించారు.

## ఆ కేసుపై కింది కోర్టులోనే తేల్చుకోండి

**ఎంపీ ఈటలకు హైకోర్టు సూచన**

**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై నమోదైన కేసును కొట్టివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కొర్రెములలో శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్ సెక్యూరిటీ గార్డును కొట్టారంటూ ఐటీ పోచారం పీఎస్‌లో ఈటలపై కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో తనపై నమోదైన కేసు కొట్టివేయాలంటూ ఈటల వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ప్రాథమిక ఆధారాలు ఉన్నందునే పోలీసులు కేసు నమోదు చేశారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. ఈ దశలో కేసును కొట్టివేయొద్దని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎంపీపై కేసును కొట్టివేసేందుకు నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం.. దీనిపై కింది కోర్టులోనే తేల్చుకోవాలని ఈటలకు సూచించింది.

# సమాచార కమిషనర్లుగా పార్టీ వాళ్లా

- నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక..
- గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్న హక్కుల కార్యకర్త

**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియ జరిగిందని.. స్క్రీనింగ్ కమిటీ సూచించిన వారిని కాకుండా ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారని 'సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ' ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్ రాజు ఆరోపించారు. ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తిస్థాయి సెలక్షన్ కమిటీ లేకుండానే సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియ జరిగిందని.. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని చెప్పారు. ఏ పార్టీకీ అనుకూలంగా ఉన్న వారిని నియమించవద్దనే నిబంధనలను తోసిపుచ్చి.. ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. అందులో ఒకరు గాంధీభవన్ పీఆర్వోకాగా, మరొకరు సీఎం కార్యాలయంలో సీపీఆర్వో, ఇంకొకరు ఒక పార్టీకి సంబంధించిన వారని.. వారిని సమాచార కమిషనర్లుగా ఎలా నియమించారని ప్రశ్నించారు. ఈ అంశంలో గవర్నర్ స్పందించాలని, ప్రభుత్వం పంపించిన పేర్లను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టం నిర్వీర్యం కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## కార్మికుల ఐక్యత కోసం కలిసి నడుద్దాం: కేటీఆర్

**సామాజిక తెలంగాణ సాధించలేకపోయాం: కవిత**



**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** కార్మికుల రెక్కల కష్టం జాతి సంపదను సృష్టిస్తోందని, మేడే స్ఫూర్తితో కార్మికుల ఐక్యత, సమానత్వం కోసం కలిసి నడుద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అడుగడుగునా కార్మికులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. సింగరేణి శ్రామికులకు బోనసలు, ఉద్యోగభద్రత, మెరుగైన సౌకర్యాలతో గౌరవించామని, టీజీఆర్టీసీ కార్మికులకు జీతభత్యాల పెంపు, ఆరోగ్యబీమా వంటి సంక్షేమ పథకాలతో భరోసా కల్పించినట్లు తెలిపారు. మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత కల్పించి సాధికారతను పెంచామని గుర్తు చేశారు. కాగా, భౌగోళికంగా తెలంగాణ తెచ్చుకున్నా... సకలజనులు, సబ్బండ వర్గాలకు న్యాయం జరిగే.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మేడే సందర్భంగా తన నివాసంలో సింగరేణి, జీహెచ్ఎంసీ, భవన నిర్మాణ, హమాలీ, ఆటో కార్మికులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి కృషి చేయాలని, సమసమాజ నిర్మాణం దిశగా మరొక తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగిద్దామని ఆమె పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణ భవన్‌లో మేడే ను పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. కాగా, భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు అనే అంశంపై జూన్ 20, 21తేదీల్లో ఇంగ్లాండ్‌లో నిర్వహించే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆక్స్‌ఫర్డ్ ఇండియాఫోరం వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ సేథీ గురువారం ఆయనకు లేఖ రాశారు.

## తెలుగులో రాసిన వారికి మార్కులు ఎలా కేటాయించారు?

- గ్రూప్-1 పరీక్షపై టీజీపీఎస్సీని ప్రశ్నించిన హైకోర్టుధ
- విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న పిటిషన్లపై హైకోర్టులో గురువారం కూడా విచారణ కొనసాగింది. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్ నంబర్లు, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేర్వేరుగా ఉంటాయన్న విషయాన్ని నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని గుర్తుచేశారు. మెయిన్స్‌లో హాల్‌టికెట్ నంబర్లు మారడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారని తెలిపారు. అలాగే మెయిన్స్ రాసిన అభ్యర్థుల సంఖ్యను కూడా ఒక్కోసారి ఒక్కోరకంగా ప్రకటించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సెంటర్ల కేటాయింపుల్లోనూ తప్పులు జరిగాయని, కొన్ని సెంటర్లలో పరీక్షలు రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. మళ్లీ మూల్యాంకనం చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోరారు. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పిందే చెప్పి, కోర్టు సమయం వృథా చేస్తున్నారన్నారు. పిటిషనర్లు అపోహ పడుతున్నారని, నిపుణుల పర్యవేక్షణలోనే మూల్యాంకనం జరిగిందని తెలిపారు. తెలుగులో పరీక్ష రాసిన వారికి మార్కులు ఎలా కేటాయించారని ధర్మాసనం ప్రశ్నించగా.. ఆయా సబ్జెక్టుల నిపుణులే మూల్యాంకనం చేసి, మార్కులు కేటాయించారని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. కాగా, బుధవారం జరిగిన విచారణలో జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు స్పందిస్తూ.. తమిళనాడులో ప్రజలకు అన్ని భాషలూ వచ్చినా, మాతృభాష అయిన తమిళంలోనే మాట్లాడతారని చెప్పారు. మన దగ్గర మాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారన్నారు. ఇది తన స్వీయ అనుభవం కూడా అని తెలిపారు.

## కార్మికులకు శ్రమ దోపిడి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు




**భైంసా, మే 1 (జనస్వరం) :** చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై పోరాటం చేద్దామని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహించి విశ్రాంతి భవనం వద్ద ఎర్రజెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా బీడీ హాస్పిటల్, అంగన్వాడి, కేజీబీవీ, ఆశ, హాస్టల్ ఇతర అనేక రకాల లక్షలాదిమంది కార్మికులకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా బీడీ కార్మికులు జీవనభృతి ఇవ్వాలన్నారు. బీడీ పరిశ్రమనునాశనం చేసే కొట్ప చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కనీస వేతనాల జీవోని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం వర్కర్లందరూ తమ పని రెగ్యులరైజ్ కోసం 26వేల కనీస వేతనం అమలు కోసం, ఉద్యోగ భద్రత కోసం పోరాడుతుంటే, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ శక్తిని దోపిడీ చేస్తున్నాయని వారు విమర్శించారు. కార్మికుల హక్కుల రక్షణకై అమెరికాలో అమరులైన చికాగో వీరుల సాక్షిగా పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే.రాజు వారు మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యతతో ఉద్యమాలు నిర్వహించి కార్పొరేట్ అనుకూల మోడీ ప్రభుత్వ మెడలు వంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గంగామణి, భోజన్న, లత విజయలక్ష్మి, ఏఐకేఎంఎస్ నాయకులు గంగాధర్, పోతన తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం కార్యక్రమం ప్రారంభించిన మహమ్మద్ అజరుద్దీన్



**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** హైదరాబాద్ లో గురువారం నుంచి జాతీయ ఉత్పత్తి, పంపిణీ పథకం సర్కిల్ నంబర్ 7లోని చౌకధరల దుకాణం నెంబర్ 789 (డీలర్ సుదర్శన్) ఇంకా 823 (బందరి సబిత)లో సన్న బియ్యం సరఫరా మొదలు, ఎమ్మెల్సీ ఎన్నికల కోడు ముగిసిన సందర్భంగా మీ ఒకటి నుంచి హైదరాబాదులో సన్న బియ్యం సరఫరా అయింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మహమ్మద్ అజరుద్దీన్ చేతుల మీదుగా సన్నబియ్యం కార్యక్రమం, యూసుఫ్గుడా డివిజన్, వెంకటగిరి లో ప్రారంభించారు.

# సత్యసాయి ఆశీస్సులతో పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రానికి పూర్వ వైభవం తీసుకొద్దాం

- కనీవినీ ఎరుగని రీతిలో పుట్టపర్తిని అభివృద్ధి చేద్దాం
- సత్యసాయి ట్రస్టు సహకారంతో బాబా శత జయంతోత్సవాల నాటికి అత్యంత సుందర పట్టణంగా ముస్తాబు చేద్దాం
- బెంగలూరు గ్రీన్ సిటి లాగా పుట్టపర్తి ని బ్యూటీ సిటీగా మారుద్దాం
- బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి నగర అభివృద్ధిపై పర్యాటక, ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్ష.



**పుట్టపర్తి, మే 1 (జనస్వరం) :** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆశీస్సులతో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి పూర్వ వైభవం తీసుకొద్దామని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులకు సూచించారు. సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల వేడుకల ఏర్పాట్లపై పుట్టపర్తి నగర అభివృద్ధి పనులపై గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి సుందరీకరణ పనులపై కాకినాడ నుంచి వచ్చిన ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్, టూరిజం జిల్లా అధికారి నర్సయ్య, రెవిన్యూ తరపున ఇంచార్జి తహసిల్దార్ కళ్యాణ్, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్ రెడ్డి, డిఈ గంగాధర్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద ఇతర శాఖ అధికారులతో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్తో ఈ అభివృద్ధి పనుల డీపీఆర్ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నగరాన్ని సుందర పట్టణంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ ఏడాది నవంబర్ 23న జరిగే బాబా శతజయంతోత్సవాల నాటికి పుట్టపర్తి నగరంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా రూ 105 కోట్లతో చిత్రావతి రోడ్డు విస్తరణతో పాటు నదీ పరివాహక ప్రాంతంలో అత్యంత సుందరీకరణ పనులు త్వరగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో సుమారు 167 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అది త్వరగా మంజూరు అయ్యేలా సీఎం చంద్రబాబుతో పాటు పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. అంతేకాకుండా నగర ప్రధాన రహదారులతో పాటు పుట్టపర్తికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రహదారులన్నీ అందంగా తీర్చిదిద్దే విధంగా ఆర్ అండ్ బి శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి వాటికి అవసరమయ్యే నిధుల కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రసాదం ప్రాజెక్టు కింద, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పుట్టపర్తి నగర అభివృద్ధికి సుమారు 864 కోట్ల నిధులు అవసరమవుతాయని, ఈ సమస్యను సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు ప్రత్యేక దృష్టి సాదిస్తానని తెలిపారు. సత్య సాయి ట్రస్ట్ సహకారంతో బాబా శతజయంతి వేడుకలకు పుట్టపర్తి నగర అభివృద్ధితో పాటు వివిధ అభివృద్ధి పనులు త్వరగా జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. శిల్పారామంలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుతో పాటు మున్సిపల్ పరిధిలోని పుడ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 14 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. పుట్టపర్తిని బ్యూటిఫుల్ సిటీగా బెంగళూరు గ్రీన్ సిటీ తరహాలో హాబీబియా మొక్కలు ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సత్యసాయి ట్రస్టు సహకారంతో పుట్టపర్తి ప్రధాన రహదారులపై మహాత్ముల విగ్రహాల ఏర్పాటు, ఇండోర్ స్టేడియం మ్యూజియం అదనపు మరుగుదొడ్లు త్రాగునీరు ఏర్పాటుకు ఆయా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతిపాదనలు పంపాలని కోరారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక సాధించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి నగరమంతా సోలార్తో విద్యుత్ తెలుగులో ప్రత్యేక లైటింగ్తో రంగురంగుల నగరంగా తీర్చిదిద్దే విధంగా చూడాలని కోరారు. చిత్రావతి చెక్ డాం ప్రత్యేకంగా నింపడానికి బుక్కు పట్నం చెరువు నుంచి నీటిని సరఫరా చేయడానికి రూ. 3కోట్లతో నీటి ఎత్తిపోతల పథకం అమలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ఆయా శాఖల సమన్వయంతో నిధులు మంజూరుకు డిపిఆర్ ప్రాజెక్టు తయారు చేయాలని ఇరిగేషన్ టూరిజం మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకుముందు పుట్టపర్తి చిత్రావతి రోడ్డు చెక్ డాం హారతి ఘాట్ వద్ద నదీ పరివాహక ప్రాంతాలను ఎమ్మెల్యేతో పాటు అధికారులు పరిశీలించారు. గోదావరి పుష్కరాలు తరహాలో స్నానపు ఘట్టాలు మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పుట్టపర్తి నగరాన్ని అత్యంత సుందర పట్టణంగా తీర్చిదిద్దే విధంగా మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. పుట్టపర్తిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి ఉండి అపరిశుభ్రంగా ఉందని ఇలా లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర మున్సిపల్ కమిషనర్కు సూచించారు. అదేవిధంగా చిత్రావతి రోడ్డు విస్తరణ చేస్తున్నందున ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇరిగేషన్ భూమిని ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారందరికీ నోటీసులు ఇచ్చి వాటిని త్వరగా తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పుట్టపర్తి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, టీడీపీ యువ నాయకులు పట్టణ కౌన్సిలర్ లక్ష్మీపతి రామారావు గంగాధర్ నాయుడు సామకోటి ఆదినారాయణ, మాజీ చైర్మన్ బీసీ గంగన్న బెస్త చలపతి, సురేష్ చౌదరి కృష్ణ ప్రసాద్, పైపల్లి శ్రీధర్ చౌదరి భద్రీ కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై తప్పక పాటించాలి

**ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచనపై హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్కులో శుభ్రత కార్యక్రమం**





**విజయవాడ, మే 1 (జనస్వరం) :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచన మేరకు, జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పార్కులను సందర్శించి, కార్పొరేషన్ సిబ్బందితో కలిసి శుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అనూష పార్కులను సందర్శించి, అక్కడ పనిచేస్తున్న కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. మే డేను సంతృప్తికరమైన పనికి, కార్మికుల కష్టాల నివారణకు, వారి శ్రమకు గౌరవం చెల్లించే రోజు అని చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా కార్మికులు చేస్తున్న అపార శ్రమ, వారి సమర్థత కష్టసాధ్యమైన సమాజ నిర్మాణంలో అనివార్యమైన భాగం. వారి జీవితాలు మెరుగుపడినట్లుగా, ఈ మే డే సందర్భంగా ప్రతి ఒక్కరి కష్టాలకు గుర్తింపును అందించాలని మేము కోరుకుంటున్నాం" అని ఆమె చెప్పారు. మే డే ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ప్రతిభ, వారి శ్రమ, వారి హక్కుల పరిరక్షణకు గౌరవం ఇవ్వాలని నాడు, ప్రతి సంవత్సరం మే 1న జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేషన్ అధికారులు, కార్మికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ఘనంగా మేడే వేడుకలు

**ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు**



**పుట్టపర్తి, మే 1 (జనస్వరం) :** కార్మికుల శ్రమ ఫలితంగానే పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, హైకోర్టు నిర్మాణాలు సాధ్యమయ్యాయని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులతో కలిసి పుట్టపర్తిలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికుల చరిత్రాత్మక పోరాటాలను, విజయాలను గుర్తు చేశారు. మేడే రోజును కార్మికుల హక్కులకు, సేవలకు నివాళి అర్పించే సందర్భంగా అభివర్ణించారు. పుట్టపర్తి మున్సిపల్ ఆఫీస్ ఎదుట జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జెండా ఆవిష్కరించి, కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్మికుల హక్కులు, పనికి తగ్గ సమాన వేతనాల కోసం జరిగిన పోరాటాన్ని గుర్తుచేశారు. "సత్యసాయి జిల్లాలో వ్యవసాయ కార్మికులు, నిర్మాణ కార్మికులు, పరిశ్రమ కార్మికులు మరియు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కృషితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతోంది," అని ఎమ్మెల్యే చెప్పారు. మేడే సందర్భంగా కార్మికులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మేడే చరిత్రను గురించి మాట్లాడుతూ, 1886లో అమెరికాలో ప్రారంభమైన కార్మిక ఉద్యమం ద్వారా ఎనిమిది గంటల పనిదినానికి నాంది పలికిందని, ఆ ఉద్యమమే ప్రపంచవ్యాప్తంగా మేడే రోజును జరుపుకునే సంప్రదాయానికి రూపకల్పన చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, పట్టణ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీసీ గంగన్న, బెస్త చలపతి, టీడీపీ యువనాయకుడు రామారావు, కౌన్సిలర్ లక్ష్మీపతి, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్, జయప్రకాశ్, కూటమి పార్టీ నాయకులు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక చట్టాల పరిరక్షణకై ఉద్యమించాలి

**ఐఎఫ్టీయూ పిలుపు**



**నంద్యాల, మే 1 (జనస్వరం) :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో ప్రగతిశీల ఆటోకార్మిక సంఘం అరుణ పతాకాన్ని జిల్లా సహారా కార్యదర్శి ఎం.శంకర్, కోశాధికారి ఎస్ చౌడప్ప ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలం పోరాటాలు చేసి అమరులు తమ రక్త తర్పణం ద్వారా సాధించిన కార్మిక చట్టాలను నేడు కేంద్రంలోని పాసిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. పరిశ్రమల యజమానులకు కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం ప్రతి కార్మికుడికి 26 వేల రూపాయలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, అలాగే ఆటో మోటార్ వాహన కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ లో ఉన్న క్లైమ్లను పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఏ రాంబాబు అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి ఆనంద్ ఐఎఫ్టీయూ నంద్యాల డివిజన్ నాయకులు డి ఫరూక్ యాకూబ్ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు రాజు వెంకటేశ్వర్లు సాయికుమార్ సురేష్ అలాగే ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పటాన్ కాజా మియా రఫీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక దినోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ



**సర్వేపల్లి, మే 1 (జనస్వరం) :** నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ముత్తుకూరు మండలంలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి పోలీస్ స్టేషన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి నాయుడు మాట్లాడుతూ, "కార్మికుల చెమట దేశానికి ఇంధనమని, వారి పోరాటాల ఫలితంగా 12 గంటల పని వేళలు 8 గంటలకు తగ్గించబడిన గొప్ప చరిత్రను మర్చిపోవద్దు" అని అన్నారు. కార్మికుల త్యాగం వల్లనే మే 1న ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అలాగే, కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కార్మికులు, శ్రామికులు, చేతివృత్తుల వారికీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా, గ్రామాలలో మహాత్మా గాంధీ పథకం కింద పని చేసే కూలీలను కార్మికులుగా నామకరణం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రహీం, సందూరి శ్రీహరి, శ్రీను, పెదకాల కిషోర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# 4 నుంచి బ్రహ్మంగారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు



**పులివెందుల, మే 1 (జనస్వరం) :** కడప జిల్లా, మైదుకూరు నియోజకవర్గం, బ్రహ్మంగారి మఠం మండలం, కందిమల్లాయపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంనందు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం నుండి శుక్రవారం వరకు వేలాది మంది భక్తులతో అంగరంగ వైభవంగా జరుపుతున్నట్లు బ్రహ్మంగారి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రెండు తెలుగు రాష్ట్రాల లోని భక్తులే కాకుండా ఇతర రాష్ట్రాల భక్తులు, ఇతర దేశాల భక్తులు స్వామి వారి ఆరాధనా గురుపూజా మహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందుతారన్నారు. కాలజ్ఞాన సృష్టి కర్త, భూత భవిష్యత్ వర్తమాన కాలాలను ప్రజలకు చాటి చెప్పిన గొప్ప మహనీయుడు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి స్వాముల వారు అని అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా, చలువ పందిళ్ళు, దాతల సహకారంతో చల్లని మజ్జిగ, ప్రత్యేక క్యూలైన్లు, ప్రత్యేక విద్యుత్ అలంకరణ, తాత్కాలిక మరుగుదొడ్లు, తాత్కాలిక ఆసుపత్రి సౌకర్యం, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రతి రోజు ఉదయాన్నే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సుప్రభాతం మొదలుకొని 8 గంటలకు అభిషేకం, సహస్ర కుంకుమార్చన, 10 గంటలకు ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. అలాగే ఆదివారం రాత్రి 7 గంటలకు శేషవాహనోత్సవం, 8 గంటలకు హరికథా కాలక్షేపం. అలాగే సోమవారం రాత్రి 8 గంటలకు హరికథా కాలక్షేపం, 10 గంటలకు గజ వాహనోత్సవం, ఉదయం స్వామి వారి ఉత్సవం, రాత్రి నరనంది ఉత్సవం. అలాగే మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు దీక్షా భందనాలంకరనోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఉపన్యాసం, 8 గంటలకు హరికథా కాలక్షేపం, బుధవారం సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం, రాత్రి 8 గంటలకు గజవాహనోత్సవం, గురువారం ఉదయం 10 గంటలకు ఉత్సవం,12 గంటలకు మహా ప్రసాద వినియోగం కలదని ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు.

**ప్రత్యేక దర్శనం రూ.100లు :**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఉత్సవాలలో స్వామి వారిని తొందరగా దర్శించుకొనుటకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, అందులకు గాను ప్రతి భక్తుడు రూ.100 టికెట్ తీసుకొని స్వామి వారిని దర్శించుకొనే అవకాశం భక్తులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. అలాగే సాధారణ దర్శనం రూ.20లుగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

**వేలాది మంది భక్తుల మధ్య బ్రహ్మ రథోత్సవం :**

బ్రహ్మంగారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు భక్తుల మధ్య ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలలో ప్రధాన కార్యక్రమం బ్రహ్మంగారి రథోత్సవం, గురువారం సాయంత్రం నాలుగు గంటలకు భక్తుల మధ్య జై వీర బ్రహ్మ జై, గోవిందమాంబ జై... గోవిందా గోవిందా అంటూ బ్రహ్మ రథోత్సవం జరుగుతుందని బ్రహ్మంగారి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. అంతే కాకుండా ఈ ఉత్సవాలలో రాష్ట్రం నలుమూలల నుండి భక్తుల చేత ప్రతి రోజు రాత్రి కులుకు భజనలు, వీరబ్రహ్మేంద్ర స్వామి డ్రామాలు, సర్కష్ లు ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. కాబట్టి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తులు ఈ ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని బ్రహ్మంగారి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు.

# కాంగ్రెస్ కార్యాలయంపై బీజేపీ నాయకుల దాడి అప్రజాస్వామిక చర్య

**మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి**



**పులివెందుల, మే 1 (జనస్వరం) :** విజయవాడలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంపైనా అలాగే, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిపై కాంగ్రెస్ నాయకులపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోడి గుడ్లతో టమాటాలతో దాడి చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య అని రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ విభజన చట్టంలో సెక్షన్ 94,సబ్ సెక్షన్ 3 ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ రాజధానిలో సచివాలయం, అసెంబ్లీ, రాజ్ భవన్, హైకోర్టు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. కానీ 11 సంవత్సరాలు అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని, ఈ అంశాన్ని ప్రస్థావిస్తే కాంగ్రెస్ నాయకులపై కోడిగుడ్లతో దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. 2015 అక్టోబర్ 22 న విజయదశమి నాడు పార్లమెంటు మట్టి, యమునా నది నీటిని తెచ్చి నరేంద్ర మోడీ ఉద్దండ రాయుని పాలెం వద్ద రాజధాని అమరావతికి శంఖుస్థాపన చేశారు కానీ పనులు జరగలేదన్నారు. 10 ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయన్నారు. చేయాలి చెల్లి పెళ్లి.. మళ్ళీ మళ్ళీ అన్నట్లు మే 2న మళ్ళీ శంకుస్థాపన చేయబోతున్నారు. ఈ విషయాన్ని ప్రస్థావించినందులకు కాంగ్రెస్ నాయకులపై టమోటాలతో దాడి చేస్తారా? రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధి నేతలనే తరిమి కొట్టిన కాంగ్రెస్ పార్టీ కొందరు బిజెపి నాయకుల తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు బెదిరి పోదని తులసి రెడ్డి అన్నారు.

**సింహాచలం దుర్ఘటన :**

పరమ పవిత్ర పుణ్యక్షేత్రం సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా బుధవారం గోడ కూలి 7 మంది భక్తులు చనిపోవడం విషాదకరం, బాధాకరమని తులసి రెడ్డి అన్నారు. మానవ వైఫల్యం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. విచారణ కమిటీ నివేదిక అందిన వెంటనే కారకులపై తగు చర్యలు తీసుకోవాలని కొంతకాలంగా దేవాలయాల వద్ద వరుస సంఘటనలు జరుగుతున్నాయన్నారు. తిరుమల కల్తీ నెయ్యి, తిరుపతి తొక్కిసలాటలో 6 మంది చనిపోవడం, టీటీడీ గోశాలలో గోవులు చనిపోవడం, కాశీనాయన క్షేత్రంలో కట్టడాలు కూల్చడం, ఇప్పుడు సింహాచలంలో గోడ కూలి ఏడుగురు చనిపోవడం ఇలా అనేక దుస్సంఘటనలు జరిగాయని, ఇవి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఫించన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తూర్పు నియోజకవర్గంలోని రాణిగారి తోట ప్రాంతంలో 17వ, 18వ డివిజన్లలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా ఫించన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల ఇళ్లకి వెళ్లి ప్రతి ఒక్కరికి రూ.4 వేల చొప్పున ఫించన్ సొమ్మును అందజేశారు. ప్రతి నెల మొదటి తేదీన ఫించన్ సొమ్ము అందుతున్నదా లేదా అనే అంశాన్ని ఎంపీ స్వయంగా లబ్ధిదా రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్, కృష్ణలంక ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. డ్రైనేజీలు, రోడ్లు, పార్కులు, స్కూల్ గ్రౌండ్లను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల వర్షాకా లంలో వర్షపు నీరు ఆగిపోవడానికి కారణమైన వాల్వులు పనిచేయకపోవడాన్ని గమనించి, వాటిని సరిచేయడానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే, రాణిగారి తోట సమీపంలోని హైవే క్రాస్ చేయడంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు నేషనల్ హైవే అథారిటీతో కలిసి సబ్వే గానీ, అండర్పాస్ గానీ నిర్మించే పనిలో ఉన్నామని తెలిపారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్తో కలిసి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా ఫించన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రమని, ఇది చంద్రబాబు పాలన లో సాధ్యపడిందన్నారు. ఒకేసారి రూ.1,000 పెంచి ఎన్నికల హామీని నెరవేర్చారని కొనియాడారు. జగన్ ప్రభుత్వానికి అదే పనికి ఐదేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. ప్రతి నెల మొదటి తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఫించన్ పెంపు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, తల్లివందనం పథకం మే చివరి నుంచి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జూలై నుంచి అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు వేముల దుర్గారావు, 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, సెక్రటరీ తలపాటి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకటనారాయణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కె. నాగలక్ష్మి, మాజీ కార్పొరేటర్ సిద్దెం నాగేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు పగడాల వెంకటేశ్వర రెడ్డి, బూత్ కన్వీనర్లు అంబటి కాశీ, వేజర్ల కాశీ, వేల్పుల విజయ, కొప్పోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి పునర్జన్మ

**- వైసీపీకి ప్రజల తీర్పుతో చెంపపెట్టు**

**- పర్చూరి అశోక్ బాబు**



**మంగళగిరి, మే 1 (జనస్వరం) :** శుక్రవారం ఏపీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు ప్రకటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవ్వడం, వైసీపీ పరిపాలనకు నిదర్శనంగా ప్రజలు ఇచ్చిన తీర్పుకు మద్దతుగా ఉందన్నారు.

**వైసీపీకి తగిన శిక్ష, ప్రజల నమ్మకానికి గౌరవం :**
జగన్ రెడ్డి మూడురాజధానుల పథకం పేరుతో అమరావతిని ముక్కలు చేయడం ప్రజలకు మోసమని వ్యాఖ్యానించారు. "రెక్కలు తెగిన పక్షిలా రాజధానిని శ్మశానంగా మార్చే ప్రయత్నం చేశారు. కానీ రాజధాని రైతుల పోరాటం, టీడీపీ, బీజేపీ, జనసేన నేతల కృషితో నేడు అమరావతికి కొత్త ప్రాణం పోసుతున్నారు," అని తెలిపారు.

**ప్రధాని సభకు జగన్ రావాలి.. తప్పు ఒప్పుకొని సరిదిద్దుకోవాలి :**
"జగన్ రెడ్డికి ధైర్యం ఉంటే రేపటి ప్రధాని సభకు రావాలి. తన చేసిన తప్పును అంగీకరించి ప్రజల ఎదుట బహిరంగంగా క్షమాపణ చెప్పాలి," అని అన్నారు. ప్రజలు వైసీపీకి కేవలం 11 సీట్లు ఇచ్చి వారి అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారని గుర్తు చేశారు.

**వైసీపీ ప్రచారాలపై ఘాటు విమర్శలు :**
వైసీపీ చేసిన దుష్ప్రచారాలను ప్రజలు గమనించారన్నారు. "అమరావతిని కులం, ప్రాంతంతో ముడిపెట్టి, మునిగిపోయే భూమి, శ్మశానం అని తప్పుడు ప్రచారం చేశారు. కానీ నేడు ప్రజల సంకల్పంతో అమరావతి నిలిచిపోయింది," అని స్పష్టం చేశారు.

**అమరావతిలో రూ.70,000 కోట్లతో అభివృద్ధి పనులు :**
ప్రస్తుతం అమరావతిలో రూ.60,000 నుంచి రూ.70,000 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. "2029 నాటికి అమరావతిని పూర్తిగా అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్లు ఇవ్వడం, రోడ్లు పూర్తి చేయడం, కేంద్ర కార్యాలయాలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది," అన్నారు.

**జగన్ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు :**
శ్రీశైలం ప్రాజెక్ట్‌పై జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. "ఐదేళ్లలో ప్రాజెక్టుకు ఐదు రూపాయలు కూడా కేటాయించలేదు. ఇప్పుడు డ్యామ్ ప్రమాదంలో ఉందన్న నివేదిక వచ్చింది. జగన్ అభివృద్ధి చుసే మనస్తత్వం లేదు," అని ధ్వజమెత్తారు.

**రైతుల త్యాగంతో సాధ్యమైన అమరావతి :**
"35,000 ఎకరాలు ఇచ్చిన రైతుల్ని జగన్ కొట్టించాడు. మహిళలపై డ్రోన్‌లతో వీడియోలు తీశాడు. అయినా 1630 రోజులు పోరాడిన రైతులు వెనక్కి తగలలేదు. ఇది ప్రజా రాజధాని. కలల రాజధాని. దేశంలోని ఇతర నగరాల కంటే అభివృద్ధిలో తలమానికంగా నిలుస్తుంది," అని తెలిపారు.

**ప్రజల మద్దతుతో అమరావతికి గౌరవం :**
హైదరాబాద్ ఎలా ఉద్యోగాలకు ఆవాసంగా మారిందో, అమరావతి కూడా యువతకు ఉద్యోగ అవకాశాల కేంద్రంగా మారుతుందన్నారు. రేపటి ప్రధాని సభను విజయవంతం చేయాలని, ప్రజల రాజధానికి అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## కడపలో బాలోత్సవం వారి వేసవి హంగామా ప్రారంభం




**పులివెందుల మే 1 (జనస్వరం) :** కడప నగరంలోని మున్సిపల్ హై స్కూల్ మెయిన్ నందు గురువారం కడప బాలోత్సవం వారి వేసవి హంగామా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం, ఇంద్రజాల ప్రదర్శన విషయాలపై హై స్కూలు విద్యార్థులకు వేసవిలో వినోదం, విజ్ఞానం అంశాలుగా సమర్ క్యాంపును మండల విద్యాధికారి గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, రిటైర్డ్ డిప్యూటీ డిఇఓ నాగముని రెడ్డి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు హాజరయ్యారు. వేసవిలో సమయాన్ని సద్వినియోగం చేస్తూ విద్యార్థుల్లో దాగివున్న అభినివేశం ఆసక్తి ఉన్న ఇతర కార్యకలాపాలలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే సొంత ఆలోచన శైలిని, విశ్లేషణా సామర్థ్యాన్ని అందించడానికి ఈ బాలోత్సవం వేసవి హంగామా కార్యక్రమం తోడ్పడుతుందని ముఖ్య అతిథి గంగిరెడ్డి తెలియజేశారు. పిల్లలు సమయపాలనతో నిర్దేశించిన అంశాల్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా నేర్చుకోవాలని నాగముని రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కడప బాలోత్సవం అధ్యక్షులు గోపాల్, అరుణ, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు శామీర్, శివరాం, వినోద్, టీచర్ చంద్రశేఖర్, శ్రీను, కృపా వేణి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు



**వరరామచంద్రపురం, మే 1 (జనస్వరం) :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మేడే ఉత్సవాలు మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి 10 గంటల కల్లా మండలంలోని మారుమూల గ్రామాల లో మేడే కార్యక్రమాలు నిర్వహించుకుని ముఖ్య నాయకత్వం అంత విఆర్ పురం నుండి రేఖపల్లి ప్రధాన స్తూపం సెంటర్కు ర్యాలీ ద్వారా రావడం జరిగింది. ప్రధాన సెంటర్లో అమరవీరుల స్తూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సున్నం రాజులు జెండాను ఎగరవేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే ఆవశ్యకతను మేడేకు కార్మికులకు ఉన్నటువంటి సంబంధాన్ని కార్మిక, కర్షకుల, పక్షాన సీపీఎం పార్టీ పోరాటాన్ని ప్రజల అనుబంధాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ పూణెం ప్రదీప్ కుమార్, సర్పంచులు వేట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, సీపీఎం సీనియర్ నాయకులు పంకు శ్రీరామమూర్తి గుండుపూడి లక్ష్మణరావు, చీరపు తాతబాబు, సోడే మల్లయ్య, కుంజా.కన్నయ్య, చిక్కాల. రామారావు, పండ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, నాలారపు ప్రకాష్ రావు, పిసా కమిటీ సారా పాండురాజు, చింటూ, చిన్ని, సుబ్బారావు, సీఐటీయూ మండల కార్యదర్శి రాజేశ్వరి, రంగమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**- పెనుమత్స వర్మ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం**

**- నివాళులర్పించిన ఎంపీ కేశినేని చిన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న**



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** టీడీపీకి కార్యకర్తలే ఆస్తి.. కార్యకర్తలకు ఏలాంటి కష్టం వచ్చినా పార్టీతోపాటు నాయకులు అందరూ అండగా ఉంటారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. టీడీపీ యువనాయకుడు పెనుమత్స వర్మ జయంతి వేడుకలు భవానీపురంలోని శివాలయం సెంటర్ లో వర్మ ఫ్రెండ్ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ముందుగా పెనుమత్స వర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వర్మ ఫ్రెండ్స్ సర్కిల్ చేపట్టే సేవ కార్యక్రమాలు అండగా ఉంటానన్నారు. వర్మను మర్చిపోకుండా వర్మ ఫ్రెండ్స్ అందరూ కలిసి జయంతి కార్యక్రమం ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు. ఆ తర్వాత బుద్ధావెంకన్న మాట్లాడుతూ వర్మ చాలా నిబద్దత క్రమశిక్షణతో పార్టీకి పనిచేసేవాడని కొనియాడారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలను ఎవరు మర్చిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, టీడీపీ యువ నాయకుడు శివా రెడ్డి, జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కో కన్వీనర్ కొప్పిరెడ్డి ఎస్.ఎన్.మూర్తిలతో పాటు వర్మ ఫ్రెండ్స్ సర్కిల్ పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన నిర్ణయం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుంది

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న జనగణనలో కులగణన కార్యక్రమం బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజల అభ్యున్నతి దోహదం చేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. వచ్చే జనగణనలో కులగణన అంశాన్ని చేర్చాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించడం పట్ల హర్షం ప్రకటించారు. "కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవటం శుభపరిణామం. కులగణన అంశాన్ని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడంతో ఎనీఏ ప్రభుత్వానికి కులగణనపై ఉన్న చిత్తశుద్ధి రుజువైందని పేర్కొన్నారు. కులగణనను కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాయని, ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటకు కట్టు బడి ఆచరణలో చూపింది. కులగణన చేపట్టడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, ప్రభుత్వ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరడానికి వీలుంది. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న కులగ ణన నిర్ణయం ఒక గొప్ప మార్పులకు సంకేతంగా మారుతుందని, సామాజిక అసమానతలను చెరిపి వేస్తుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అంతర్ల శివాలయంలో వికసించిన బ్రహ్మకమలం

**భక్తులను అలరిస్తున్న దేవ పుష్పం**



**చింతపల్లి, మే 1 (జనస్వరం) :** మండలానికి సమీపంలోని అంతర్ల గ్రామంలో ఉన్న సోమలింగేశ్వర స్వామి ఆలయంలో అరుదైన బ్రహ్మకమలం పుష్పం వికసించి భక్తుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ప్రత్యేకత గల పుష్పం సాధారణంగా రాత్రి సమయంలో మాత్రమే వికసిస్తుంది. ఘనమైన పరిమళాలతో చుట్టుపక్కలవాటిని వెదజల్లుతూ, ఆలయ పరిసరాలను మలినశూన్యంగా మార్చింది. పూజా స్థల సమీపంలో ఉన్న పూల కుండీలో నాటిన బ్రహ్మకమలం మొక్క ఇప్పుడు ఐదు రకాలుగా పుష్పించడంతో భక్తుల్లో ఉత్సాహం పెరిగింది. రాత్రి సమయంలో వికసించే ఈ పుష్పం కేవలం తక్కువ సమయంలో మాత్రమే పూర్తిగా వికసించి కనిపిస్తుంది. దీంతో ప్రతి ఒక్కరు దాన్ని తిలకించేందుకు ఆలయానికి వస్తున్నారు. స్థానిక గ్రామస్తులు, భక్తులు ఈ అరుదైన ప్రకృతి కనువిందును ఆస్వాదిస్తూ, "బ్రహ్మకమలం పూల వాసన అపూర్వంగా ఉంది, దర్శనం చేసుకోవడం గొప్ప అదృష్టం," అంటూ పరస్పరం పంచుకుంటున్నారు. ఆలయ పురోహితురాలు శివానంద మాతాజీ ఈ పుష్ప వికాసాన్ని విశేషంగా పరిగణిస్తూ, భక్తుల సౌలభ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రకృతిని ఆరాధించే సందర్భంగా మారిన ఈ దృశ్యం, గ్రామ ప్రజలకే కాదు, పరిసర ప్రాంతాల వారికీ ఆకర్షణీయంగా మారింది.

## అరటి రైతులను ఆదుకుంటాం..

**- రూ.20వేల చొప్పున చెల్లించేందుకు జగన్ సుముఖత**

**- 630 మంది రైతులు అర్హులుగా గుర్తింపు**

**- రూ.1.30 కోట్లు డీడీల రూపంలో అందజేస్తాం**

**- వైఎస్ అవినాష్ రెడ్డి వెల్లడి**



**పులివెందుల, మే 1 (జనస్వరం) :** పులివెందుల ప్రాంతంలో పెనుగాలుల దాటికి దెబ్బతిన్న అరటి రైతులను ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. హెక్టార్ రూ.20వేల పాయల చొప్పున వైసీపీ తరఫునపరిహారం చెల్లించేందుకు మాజీ సీఎం జగన్ సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. 630 మంది రైతులు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు.. వీరందరికీ రూ. 1.30కోట్లు డీడీ రూపంలో ఆయా గ్రామాల రైతులకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది మార్చి 22వ తేదీన లింగాల మండలంలో పెను గాలుల దాటికి వందలాది ఎకరాలలో అరటి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. అదే నెల 24వ తేదీన వైసీపీ అధినేత జగన్ రెడ్డి దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించారని తెలిపారు. మేరకు రైతులను ఆదుకుంటామని అప్పట్లో జగన్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హామీని నిలుపుకుంటామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన బాధ్యతను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 26 కోట్లతో అరటి రైతుల కోసం వైసీపీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ని ఏర్పాటు చేసిందని, కానీ దాని వినియోగంలోకి తీసుకురావడంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పులివెందుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధితో ఏంటో అర్థం చేసుకోవచ్చని, ఈ కోల్డ్ స్టోరేజ్ని వినియోగంలోకి తీసుకొచ్చి ఉంటే ధరల స్థిరీకరణకు అవకాశం ఉండేదన్నారు. ధరల స్థిరీకరణ జరిగితే రైతుకు ప్రయోజనం కలిగేదన్నారు.గత నెలలో అరటి ధర ఓ మోస్తారుగా ఉండేదని, ఇప్పుడు అరటి ధర పడిపోయి రైతుకు గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. పులివెందులలో 30 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని దాన్ని వినియోగంలోకి తీసుకురావడం, మెడికల్ కాలేజ్ నిర్మించి 50 సీట్లు మంజూరు అయ్యేలా వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తే వచ్చిన సీట్లను వద్దని రాసి పంపించిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదే అన్నారు. 6 సార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యే గా, కడప నుంచి నాలుగుసార్లు ఎంపీగా, రెండుసార్లు సీఎంగా గెలిచి పులివెందులను అభివృద్ధి చేస్తే ఇప్పుడు మెడికల్ కాలేజీకి ఆయన పేరును తీసివేసి కూటమి ప్రభుత్వం రాక్షస ఆనందం పొందుతుందని విమర్శించారు. మెడికల్ కాలేజీ మెయిన్ గేట్‌కు ఉన్న వైఎస్ఆర్ పేరు తొలగిస్తారేమో కానీ ఈ ప్రాంత ప్రజల్లో ఆయనకున్న స్థానాన్ని అయితే చెరిపి వేయలేరన్నారు. చెయ్యని పనులు చేసినట్లు చెప్పుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఏ పని ఎవరు చేశారో ప్రజలందరికీ తెలుసు అన్నారు. గండి క్షేత్రంలో 26 కోట్లతో వైసిపి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్న చిన్న చిన్న పనులు చేయలేక అసంపూర్తిగా వదిలేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో గంజాయి రవాణా విస్తృతంగా పెరిగిపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మద్యపానాన్ని కట్టడి చేస్తే ఈ ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా వీధికి ఒక మద్యం షాపును తెరిచిందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మంగిలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**ఎంపీడీఓ శ్రీనివాసరావు**



**చింతపల్లి, మే 1 (జనస్వరం) :** మండలంలోని కొమ్మంగి పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను గురువారం ఎంపీడీఓ యూవీఎస్ శ్రీనివాసరావు స్వయంగా సందర్శించి పరిశీలించారు. స్థానిక అధికారులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఫారం పౌండ్స్ నిర్మాణ కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా మాస్టర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించిన ఆయన, గతంలో చేపట్టిన పనులను సమీక్షించి వాటి నాణ్యతపై తన సంతృప్తిని వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో ప్రత్యక్షంగా సంభాషించిన శ్రీనివాసరావు, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పనుల పురోగతిని అధికారులు ధృవీకరించారు. గ్రామీణ జీవనోపాధి మెరుగుదలలో ఉపాధి హామీ పథకం కీలకపాత్ర పోషిస్తోంది. ప్రజల జీవనోపాధి మెరుగుపరిచే దిశగా ఉపాధి పథకం కొనసాగింపు అవసరం ఉందన్నారు. ప్రజలకు నిరంతర ఉపాధిని అందించేందుకు నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మన్యం బంద్‌ను జయప్రదం చేయండి



**విఆర్ పురం, మే 2 (జనస్వరం) :** మన్యం బంద్ ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పులి సంతోష్ కుమార్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు పూణెం ప్రదీప్ కుమార్ కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నేడు ఏజెన్సీలో జరుగుతున్నటువంటి ఉపాధ్యాయ నియామకాల్లో 100 శాతం ఉద్యోగాలు గిరిజన యువతి, యువకులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జీఓ నెంబర్ 3 రద్దు చేయడం వల్ల నేడు ఏజెన్సీలో చదువుకున్న నిరుద్యోగ యువతి యువకుల పరిస్థితి దారుణంగా ఉందని ఆరు శాతం రిజర్వేషన్తో ఉద్యోగ నియామకాలు చేపడితే ఆదివాసీలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే స్థానిక ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని, ఆదివాసీలకు స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలన్నారు. జరగబోయే మన్యం బంద్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, విద్యార్థి, వ్యాపార, విద్యాసంస్థలు, మేధావులు, విద్యావంతులు, వివిధ సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు తదితరులు సహకరించాలని కోరారు.

## ఆళ్ళ యామినీని అభినందించిన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు

**- విద్యార్థులు సాధిస్తున్న అద్భుత విజయాలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది**

**- ముఖ్యంగా ఆడపిల్లలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తి దాయకంగా ఉన్నాయి**

**- చదువుని మించిన సంపద... విద్యకు సరి తూగగల ఐశ్వర్యం సృష్టిలో లేవు**

**- జనసేన రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు**



**గుంటూరు, మే 1 (జనస్వరం) :** జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కుమార్తె ఆళ్ళ యామినీ విద్యాధరి పదవ తరగతిలో 600 కి 594 మార్కులు సాధించిన సందర్భంగా యామినీ విద్యాధరికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అభినందనలు తెలిపి ఆశీస్సులు అందజేశారు. గురువారం ఓ ప్రముఖ హోటల్లో నాగబాబును ఆళ్ళ హరి, శిరీష దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులు సాధిస్తున్న విజయాలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తుందన్నారు. ముఖ్యంగా చదువులో ఆడపిల్లలు సాధిస్తున్న అనితర సాధ్యమైన విజయాలను చూస్తుంటే గర్వకారణంగా కూడా ఉంటుందన్నారు. చదువుని మించిన సంపద, విద్యకి సరితూగగల ఐశ్వర్యం లేదన్నారు. తల్లితండ్రులు ఎన్నో కష్టాలు పడుతూ పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నారని, వారి కష్టాలకు తగ్గట్టుగా విద్యార్థులు బాగా చదవాలని కోరారు. ఆళ్ళ హరి మెగాఫ్యామిలీకి వీరాభిమాని అని, మా అభిమాన కుటుంబ సభ్యుల్లో రికార్డు స్థాయి మార్కులు సాధించటం వ్యక్తిగతంగా తనకి ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఏ ఆపద వచ్చినా ఇంటి పెద్ద కొడుకు చంద్రబాబు అండగా ఉంటారు
- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు పంపిణీ





**పుట్టపర్తి, మే 1 (జనస్వరం) :** పేదల పక్షపాతి సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు. ఆస్పత్రిలో చికిత్స పొంది లక్షలాది రూపాయలు వైద్య చికిత్సల ఖర్చు చేసుకొని ఆర్థికంగా చితికిపోయిన పలు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పేదలకు జబ్బు చేస్తే రోగం నయం చేసుకోవడానికి లక్షలాది రూపాయలు ఆస్పత్రులకు చెల్లించలేని పేదలకు ప్రభుత్వం అండగా ఉండి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం ఇచ్చే విధంగా సీఎం చంద్రబాబు ఎంతో మంచి నిర్ణయాన్ని తీసుకున్నారని పేర్కొన్నారు. ఇంట్లో ఉన్న వారికి పెద్ద జబ్బు చేస్తే దాన్ని నయం చేసుకోవడానికి లక్షలాది రూపాయలు కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించే పరిస్థితి ఉన్న నేటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తోందన్నారు. అంతే కాకుండా కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది లక్షలాది రూపాయలు వెచ్చించి తీవ్రంగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఇంటి పెద్ద కొడుకుగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయాన్ని అందించి ఆ కుటుంబాలకు ఒక విశ్వాసాన్ని నమ్మకాన్ని భరోసాను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆపదలో అండగా నిలుస్తున్న ఇలాంటి మంచి నాయకుడు సీఎం చంద్రబాబుని, ఇలాంటి మంచి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు చిరకాలం గుర్తుపెట్టుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పెద్ద కమ్మవారి పల్లి గ్రామానికి చెందిన దేవరేంటి చక్రవర్తికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10 లక్షలు, వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన బి గోపాల్‌కి రూ.5 లక్షల 50 వేలు నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట సోమశేఖర్ రెడ్డికి 2,13,406 ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చెక్కులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు.

**టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ శంకరప్పకు నివాళి :** మండలంలోని మామిళ్ళ కుంట క్రాస్‌లో గుడిపాటి శంకరప్ప వర్ధంతికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. కీర్తిశేషులు డాక్టర్ శంకరప్ప సమాధి ఘాటు వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూర పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడికి విచ్చేసిన టీడీపీ నాయకులను కార్యకర్తలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. శంకరప్ప వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టణ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, రూరల్ మండల కన్వీనర్ విజయ్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, టీడీపీ యువ నాయకులు రామారావు, లక్ష్మీపతి శ్రీరామ్ రెడ్డి, కొత్తచెరువు టీడీపీ సీనియర్ నాయకులు సాలక్‌గారి శ్రీనివాసులు, పుల్లప్ప, ఓబులేసు, విజయ్, చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, పైపల్లి శ్రీధర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో సంక్షేమ విప్లవం

- సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా సూపరిపాలన
- పారదర్శక, జవాబుదారీ పాలన కూటమి లక్ష్యం
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం
- గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఘనత కూటమి ప్రభుత్వానిదే
- జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**గుంటూరు, మే 1 (జనస్వరం) :** గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం విప్లవత్మాక మార్పులు తీసుకొచ్చిందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. గత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సామాజిక పింఛన్లు నెలకు రూ.4 వేలు మొదటి తారీఖునే కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పంపిణీ చేస్తుందన్నారు. గురువారం తెల్లవారుజామునుంచే సచివాలయం సిబ్బందితో కలిసి కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే వచ్చే నెల ఇచ్చేవారు కాదన్నారు. అలాగే పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోతే ఆ పెన్షన్ భార్యకు ఇవ్వటానికి సంవత్సరాలు గడిపేవాళ్ళన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని భర్త చనిపోయిన తరువాత నెలకే భార్యకు పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పారదర్శక, జవాబుదారీతన పాలనతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో సూపరిపాలన సాగుతుందన్నారు. అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్న కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబూబ్ బాషా, టీడీపీ యువ నాయకులు చింతకాయల వెంకట సాయి, బీజేపీ నేత అప్పిశెట్టి రంగా, సచివాలయం సిబ్బంది వరలక్ష్మి, బ్రాహ్మణి, ప్రభ పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి వార్షికోత్సవం

**మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు**



**చింతపల్లి, మే 1 (జనస్వరం) :** మన్య ప్రాంతానికి ఆరాధ్య దైవమైన గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి వార్షికోత్సవం పురస్కరించుకుని చింతపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఆయన సతీమణి రాధ ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించి, అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ప్రారంభమైన కార్యక్రమాల్లో అర్చకులు కుంకుమ పూజ, అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామభక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ఊరేగింపుగా గ్రామ వీధుల్లో తిప్పి, ఆలయంలో సమర్పించారు. భక్తులందరికి భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఏటా మే 1న అమ్మవారి వార్షికోత్సవం పురవీధుల్లో సారేతో ఊరేగింపుగా నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోందని, గడచిన కొన్నేళ్లుగా ఈ కార్యక్రమం భక్తుల సహకారంతో విజయవంతంగా జరుగుతోందని బాలరాజు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, మహిళలు, గ్రామస్థులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీమంత్రి బాలరాజు దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి వినాయకరావు, పెద్దిరెడ్ల బేతాళుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా యూనిటీ కప్ చింతపల్లి సీజన్-3 క్రికెట్ టోర్నీ

**రాము మెరిశాడు.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఘనత**



**చింతపల్లి, మే 1 (జనస్వరం) :** చింతపల్లిలో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర 'యూనిటీ కప్ చింతపల్లి సీజన్–3' క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ క్రికెట్ క్రీడా పండుగలో గురువారం జరిగిన పోటీలు ప్రేక్షకులను అలరించాయి. ప్రత్యేకంగా 40 ప్రోస్ జట్టు మరియు గిరిజన సంక్షేమ కేంద్రకృత ఆశ్రమ పాఠశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. పొట్టి ఫార్మాట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో గిరిజన ఆశ్రమ పాఠశాల జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 79 పరుగులు చేసింది. ప్రత్యుత్తరంగా బరిలో దిగిన 40 ప్రోస్ జట్టు, ప్రారంభం నుంచే దూకుడు చూపించి కేవలం 7 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. తొమ్మిది వికెట్ల తేడాతో 40 ప్రోస్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడిన రాము, అత్యధిక స్కోరు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అతనికి డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి తాంగుల జగత్ రాయ్ చేతుల మీదుగా ప్రత్యేకంగా రూపొందించిన షీల్డ్‌ను బహుమతిగా అందించారు. 40 ప్రోస్ జట్టు కెప్టెన్ చల్లంగి నరేష్ నేతృత్వంలో బలమైన ప్రదర్శన చేస్తూ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ టోర్నమెంట్ సందర్భంగా యువ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు, స్థానిక క్రీడాభిమానులకు వినోదం కలుగుతోంది. వచ్చే రోజులలో మరిన్ని ఉత్కంఠ భరిత పోటీలు జరగనున్నట్టు నిర్వాహకులు దొండ చినబాబు, మండి భూషణం, ఆర్మ, గోవింద్, వజ్రపు లోకేష్, 40 ప్రోస్ జట్టు సభ్యులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం



**పెదపాడు, మే 1 (జనస్వరం) :** పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు అన్నారు. గురువారం పెదపాడు శాఖా గ్రంథాల యంలో వేసవి సెలవులలో భాగంగా ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో నాలుగవ రోజు విద్యార్థులు శిక్షణా తరగతులకు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ బెహర శివపార్వతిచే "మహా త్మా గాంధీ" (మోహన్ దాస్ కరంచంద్ గాంధీ) జీవిత చరిత్రను విపులంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిగా తెలియపరచి బాల బాలికలను కొన్ని ప్రశ్నలు అడిగారు. అనంతరం పరమానందయ్య శిష్యు ల కథలోని "కాలువ దాటుట" అనే కథను బాలికలచే చదివించారు. తదుపరి నృత్య శిక్షణలో భాగం గా బాలికల చేత డ్యాన్స్ కార్యక్రమం చేయించారు. ఈ కార్యక్రమంలో 28 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## అమరావతి స్పోర్ట్స్ సిటీలో చెస్ అకాడమీ పెట్టేందుకు కృషి చేస్తా

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- సిడ్నీ ఇంటర్నేషనల్ చెస్ ఛాలెంజెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన పొట్లూరి సుప్రీత
- పొట్లూరి సుప్రీతను సన్మానించిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మించబోయే అమరాతి స్పోర్ట్స్ సిటీలో చెస్ అకాడమీ స్థాపించేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆస్ట్రేలియాలో ఏప్రిల్ 23 నుంచి 27 వరకు నిర్వహించిన సిడ్నీ ఇంటర్నేషనల్ చెస్ ఛాలెంజెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన ఉమెన్ ఫైడ్ మాస్టర్ (డబ్ల్యూఎఫ్ఎం) పొట్లూరి సుప్రీతకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలపటంతో పాటు శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ చెస్ కోచ్ వి.ఆర్.బొబ్బ ఆధ్వర్యంలో పొట్లూరి సుప్రీత గురువారం మర్యాదపూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ అతి త్వరలోనే చెస్ క్రీడాకారులతో మాట్లాడి వారికి కావాల్సిన వనరులు సమకూర్చి వారు గ్రాండ్ మాస్టర్ అయ్యేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిజేస్తామన్నారు. సీఎం చంద్రబాబు క్రీడలంటే బాగా ఇష్టమని, అందుకే రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. అమరావతి స్పోర్ట్స్ సిటీతో పాటు స్పోర్ట్స్ యూనివర్శిటీ రాజధాని ప్రాంతంలో ఏర్పాటు కానుందన్నారు. అలాగే కుటుంబ పరిస్థితుల కారణంగా చెస్‌కి ఆరేళ్లు గ్యాప్ ఇచ్చిన తర్వాత కూడా సుప్రీత తన విజయపరంపరను కొనసాగించటం చాలా గొప్ప విషయమంటూ ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం కోచ్ వి.ఆర్.బొబ్బ మాట్లాడుతూ ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీకి చెందిన పొట్లూరి సుప్రీత సిడ్నీలో జరిగిన సిడ్నీ చాలెంజస్ చెస్ టోర్నమెంట్‌లో మొత్తంగా తొమ్మిది ఆటల్లో ఏడు గెలిచి, ఒకటి డ్రా చేసి విజేతగా నిలిచి బంగారు పతకం సాధించటంతో పాటు వెయ్యి డాలర్లు సాధించుకుందన్నారు. అలాగే చెస్ క్రీడలో అత్యంత ముఖ్యమైన ఫిడే రేటింగ్స్ 49.80 కైవసం చేసుకుని, తను ప్రస్తుతం 1949 పాయింట్స్‌కి చేరుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 2002లో చంద్రబాబు వరల్డ్ ఛాంపియన్స్ షిప్ నిర్వహించటానికి పూర్తి సహాయ సహకారాలు అందజేశారని గుర్తు చేశారు. ఆ పాలసీ విధానం వల్ల రాష్ట్రం నుంచి కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, పెంట్యాల హరికృష్ణ, ముసునూరు లలితబాబు నలుగురు గ్రాండ్ మాస్టర్స్ తయారు అయ్యారన్నారు. అలాగే ఎన్టీఆర్, కృష్ణాజిల్లా చెస్ అండర్ 11 బాయ్స్, చెస్ అండర్ 13 బాయ్స్ విజేతలైన ఉప్పలపాటి హర్షిత సాయి, కె.శౌర్యలకు అభినందనలు తెలిపి ఎంపీ కేశినేని శివనాథ్ బహుమతులు అందజేశారు. అలాగే చిన్నారులు హీరశేషసాయి కొమ్మినేని, ఈషా శేష సాయి కొమ్మినేని నగదు బహుమతి అందజేశారు. చెస్‌లో బాగా రాణిస్తూ పదవ తరగతిలో 566 మార్కులు భానుశ్రీ చెన్నూరికి రూ.5660 నగదు బహుమతిని ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. చెస్‌లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు చెస్‌తో పాటు చదువుల్లో కూడా రాణించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు.

## కార్మికులే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి ఆదాయం వనరులు

**ఎంపీడీఓ శ్రీనివాసరావు**



**చింతపల్లి, మే 1 (జనస్వరం) :** ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న కార్మికులే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయ వనరుల ప్రాణాధారమవుతున్నారని ఎంపీడీఓ యూవీఎస్. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కార్మిక దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్థానిక కార్మికులతో కలిసి ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, కార్మికులు అందించే సేవల ద్వారానే ప్రభుత్వ యంత్రాంగం ముందుకు సాగుతోందని, కార్మికుల శ్రమను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమ జాతికి హక్కులను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు నినాదాలతో తమ సంఘీభావాన్ని వ్యక్తపరచారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కార్మికులు ఎంపీడీఓకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా కార్మికులు, సంఘాల నేతలు పాల్గొన్నారు.

## పేదల మొహాల్లో ఆనందం చూడాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం

**పుట్టపర్తిలో పేదలకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**పుట్టపర్తి, మే 1 (జనస్వరం) :** పేదల మొహాల్లో చిరునవ్వు చూడాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎస్బిఐ రోడ్డు బీఎస్ఎన్ఎల్ కాలనీ వీధిలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు వేల రూపాయలు ఉన్న పెన్షన్‌ను ఒకే సారి రూ.1000లకు పెంచి నెలకు మొత్తం రూ.4000లు అందజేస్తోందని తెలిపారు. ఒకే రోజు 65 లక్షల కుటుంబాలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.4400 కోట్లు పింఛన్లు మంజూరు చేసి గ్రామాల్లో ఒక పండుగ వాతావరణం నెలకొనే విధంగా ప్రభుత్వం ప్రతి నెల 1న చర్యలు తీసుకుందని చెప్పారు. కులమతాలకు పార్టీల కచ్చితంగా పేదలకు పెన్షన్లు మంజూరు చేసి ఇది మంచి ప్రభుత్వమని సగర్వంగా ప్రజల ముందుకు పోతున్నామని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కూటమి నాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి సన్మానం చేశారు. అనంతరం కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పుట్టపర్తి చిత్రావతి సుందరీకరణ పనులపై మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి నరసయ్య, కాకినాడకు చెందిన ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్, పుట్టపర్తి తహసీల్దార్ కళ్యాణ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి చిత్రావతి రోడ్డు హారతి ఘాట్ తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక పుట్టపర్తి పట్టణ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, టీడీపీ యువ నాయకులు కౌన్సిలర్ లక్ష్మీపతి రామారావు, పుట్టపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్లు బీసీ గంగన్న, బెస్త చలపతి, టీడీపీ నాయకులు గంగాధర్ నాయుడు, సామకోటి ఆదినారాయణ, సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్, పైపల్లి శ్రీధర్ బద్రి, శామీర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి తరలివెళ్లిన పుట్టపర్తి కూటమి నాయకులు

- ప్రధాని మోడీ ప్రారంభోత్సవ పనులను అమరావతిలో మంత్రులతో కలసి పర్యవేక్షించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి
- పుట్టపర్తి నుంచి భారీగా తరలివెళ్ళిన కూటమి కార్యకర్తలు



**కొత్తచెరువు, మే 1 (జనస్వరం) :** అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా శుక్రవారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు సుమారు 500 మంది విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఇప్పటికే గత రెండు రోజుల క్రితం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విజయవాడలో ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అమరావతి రాజధాని నిర్మాణం, హైకోర్టు నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రధాని మోడీ ప్రారంభించనుండడంతో గురువారం మంత్రులతో కలసి ఏర్పాట్లను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పుట్టపర్తి నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అదేశాల మేరకు నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి భారీగా కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున 30 బస్సుల్లో అమరావతికి తరలివెళ్లారు. అమరావతి రాజధాని, హైకోర్టు నిర్మాణాలు సకాలంలో పూర్తి అయితే రాష్ట్రానికి దేశంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రామాంజినేయులు, లక్ష్మీపతి రామారావు గంగాధర్ నాయుడు, విజయ్ కుమార్, మల్లి రెడ్డి గంగాధర్, జయచంద్ర గోపాల్ రెడ్డి, మైలే శివశంకర్, మాజీ జెడ్పీటీసీలు పిట్టా ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాలెక్క గారి శ్రీనివాసులు, వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, చెన్నకేశవులు, రత్నప్ప చౌదరి, శ్రీరామ్ రెడ్డి పుల్లప్ప, లాయర్ కృష్ణ రామాంజనేయులు నారాయణ, జ్యోతి ప్రసాద్ సూర్యనారాయణ, మేకల ఈశ్వర్ పూల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే వేడుకల్లో మంత్రి రామానాయుడు సందడి

పాలకొల్లు, మే 1 (జనస్వరం) : ఆయన ఓ రాష్ట్రానికి మంత్రి. ఏ రాష్ట్రానికో కాదు, స్వయానా మన ఆంధ్ర రాష్ట్రానికి జల వనరుల శాఖా మంత్రిగా ప్రజలకు విశేషమైన సేవలందిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాంటి అత్యున్నత వ్యక్తి ఆ మంత్రి. ఆయన ఏం చేసినా బడా సెన్సేషనల్ న్యూసే..! పక్కా స్పెషలే..! క్లాసుకి క్లాస్, మాస్‌కి మాస్ అని చెప్పక తప్పదు. పాలకొల్లు ఎమ్మెల్యేగా 3వ సారి గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీస్సులతో పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి పదవి దక్కించుకున్న ఏకైక ఎమ్మెల్యే కూడా. రాష్ట్రంలో బలమైన నేతగా పేరు తెచ్చుకున్న ఆయన ఎవరో మీకు ఇప్పటికే తెలిసే ఉంటుంది. ఆయన పేరు నిమ్మల రామానాయుడు. గురువారం మే డే కావడంతో.. పాలకొల్లులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మేడే వేడుకలలో ఊహించిన విధంగా, ఒక్కసారిగా రిక్షా కార్మికుని అవతారం ఎత్తారు మంత్రి రామనాయుడు. మండుటెండను సైతం లెక్కచేయకుండా, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వందలాది మంది రిక్షా కార్మికులతో కలిసి రెట్టించిన ఉత్సాహంతో రిక్షా తొక్కారు. మేడే సందర్భంగా రిక్షా కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుంచి పెద్ద గోపురం సెంటర్, పాత పోలీస్ స్టేషన్ సెంటర్, కారుమూరి వారి వీధి, ఎన్టీఆర్ కళాక్షేత్రం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, లాకు దిగువ, రైల్వే గేట్ సెంటర్ మీదుగా మంత్రి కార్యాలయం మంత్రి స్థానిక రిక్షా కార్మికులతో కలిసి రిక్షా తొక్కుతూ ర్యాలీగా ముందుకు సాగారు. ర్యాలీలో పాల్గొన్న కార్మికులందరికీ టీ షర్టు, రెండు టవల్స్‌ను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి రామానాయుడు అందజేశారు. అందరికీ భోజనాలను ఏర్పాటు చేశారు. ప్రతి కార్మికుడికి మంత్రి రామానాయుడు పేరుపేరునా మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాలకొల్లు పెద్దకూలి ని నేనే అంటూ చమత్కరించారు. గత 15 సంవత్సరాలుగా మేడే రోజున ఈ విధంగా కార్మికులతో కలిసి వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తిని ఆనందాన్ని ఇస్తుందని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు కార్మికులు కర్షకులకు అండగా అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లోనూ మంత్రి రామానాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రావు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు (జి.వి), బీజేపీ నాయకులు యర్రంశెట్టి పద్మారావు, ధనాని సూర్యప్రకాష్, మండాది అవినాష్, వల్లభు శ్రీనివాస్, పొట్నూరి శ్రీనివాస్, జగురోతు రాంబాబు, బిరుదుకోట సోమ శేఖర్, మల్లంపల్లి పకీర్ బాబు, వట్టం గణేష్, జనసేన నాయకులు నరసయ్య, తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, కొమ్మల దినేష్, పినిశెట్టి శ్రీనివాస్, బుట్ట లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి, ఉన్నమట్ల కపర్ది, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, రియా, విన్నకోట గణేష్, మండెల రాంప్రసాద్, వరద శేషు, మధ్య సన్యాసినాయుడు, నడింపెల్లి రామాంజనేయులు, గాదే చిన వెంకన్న, వీరా కిరణ్ కుమార్, ముత్తాబత్తుల దొరబాబు, మేడిశెట్టి కేశవ, అన్నాబత్తుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులందరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే.రత్న ప్రసాద్**



దెందులూరు, మే 1 (జనస్వరం) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి/సీనియర్ సివిల్ జడ్జి కె. రత్న ప్రసాద్ ముప్పవరం గ్రామంలోని నాగ హనుమాన్ సాల్వెంట్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఈరోజు ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా కార్మికులకు/ అసంఘటిత కార్మికులకు కార్మిక చట్టాల పైన అవగాహన కలిగించడం జరిగిందని, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాయని ఈ-శ్రాం పోర్టల్ నందు కార్మికుల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా పొరపాటున జరిగే ప్రమాదాలలో నష్టపరిహారం పొందవచ్చని, ఆరోగ్య భీమా కూడ పొందడం కోసం ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. కార్మికులు తమ వివరాలను ఈశ్రాం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని అలాగే ఏదైనా కర్మాగారాలలో లేదా సంస్థలలో బాలల చేత పనిచేయిస్తున్నా, తప్పనిసరిగా న్యాయ సేవాధికార సంస్థల దృష్టికి తీసుకురావాలని తద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించవచ్చని సూచించారు. కార్మికులకు ఎటువంటి న్యాయ సహాయము కావలసిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని ఈ అవకాశాన్ని కార్మికులందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు.

## అభివృద్ధికి విద్యే రాజమార్గం

**- జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ**

**- ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతుల సత్కార కార్యక్రమం**



ఏలూరు, మే 1 (జనస్వరం) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం జిల్లాపరిషత్తు మినీ సమావేశ మందిరంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురికి విద్యార్థులకు, ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధికి విద్యే మౌలికమైన రాజమార్గమని, ప్రభుత్వ పాఠశాలల ద్వారా మానసిక, శారీరక వికాసంతో పాటు సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "పట్టిన విద్యా భవిష్యత్తుకు పునాది అవుతుంది. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి" అని చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అత్యుత్తమ శిక్షణ పొందినవారని, పోటీ పరీక్షల ద్వారా ఎంపికైనే ఉపాధ్యాయులుగా నియమించబడతారని వివరించారు. విద్యార్థులు విద్యాభ్యాసం ద్వారా రాష్ట్రానికి, దేశానికి గౌరవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిభా పురస్కారంగా ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు రూ. 10,000 నగదు బహుమతి, ద్వితీయ, తృతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చినవారికి రూ.5,000 నగదు బహుమతి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

**ప్రధాన బహుమతి పొందిన విద్యార్థులు :**

ఏలూరు జిల్లా పెదపాడు మండలం నుండి కలిపింది నిహారిక పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుండి కొల్లి శానవి వీరు తమ సందేశంలో ప్రభుత్వ ఉచిత విద్యా విధానం, విజయకేతనం స్టడీ మెటీరియల్ ద్వారా మేము మంచి ఫలితాలు సాధించామని, భవిష్యత్తులో ఉన్నత విద్యాసాధన ద్వారా రాష్ట్రానికి, దేశానికి సేవచేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సీఈఓ కె. భీమేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు యం. వెంకట లక్ష్మమ్మ, ఇ. నారాయణ, డిసిఈబి కార్యదర్శి ఏ. సర్వేశ్వరరావు, డివైఇవో యన్. రవీంద్ర భారతి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, జిల్లా పరిషత్తు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



దెందులూరు, మే 1 (జనస్వరం) : విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథ పాలకులు గురింద పల్లి రాంబాబు అన్నారు. గురువారం పోతునూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నాలుగవ రోజు వివిధ స్కూల్ల నుండి విద్యార్థులు 14 మంది వచ్చారు. వారిని మొదటిగా చదివించడం తదుపరి నీతి కథలు చెప్పించడం వచ్చారు చెప్పించడం, క్యారం బోర్డ్స్ ఆడించడం వంటివి చేయించారు. రిసోర్స్ పర్సన్ సందీప్ కుమార్ పర్యవేక్షణలో జీకే, క్విజ్ మరియు స్పోకెన్ ఇంగ్లీష్ మీద అవగాహన కార్యక్రమం జరిగాయి. తదుపరి విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

## శాస్త్రోక్తంగా.. దత్తాత్రేయస్వామికి విశేషపూజలు..



శ్రీశైలం, మే 1 (జనస్వరం) : శ్రీశైలమహాక్షేత్రంలో గురువారం ఉదయం దత్తాత్రేయస్వామికి ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించామని, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోకకల్యాణం కోసం ప్రతి గురువారం దేవస్థానం సేవగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద వేంచేబు చేసి వున్న శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలు నిర్వహిస్తారు. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు అర్చక స్వాములు ముందుగా మహా గణపతి జరిపించారు. తదుపరి దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష పూజల అనం తరం ప్రత్యేక హారతులు సమర్పించారు. లోకొద్దరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూ పంలో దత్తాత్రేయునిగా అవతరించారని అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడని పురాణాలు చెబుతున్నాయి.

## మానవత సంస్థ ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం



భీమడోలు, మే 1 (జనస్వరం) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు మానవతా ఆఫీస్‌లో గురువారం భీమడోలు మండలంలో ఉన్న అన్ని స్కూళ్లల్లో అత్యధిక మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు రూ.1000 నగదు బహుమతితో సత్కరించారు. ఆ కార్యక్రమంలో గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, ఆ కార్యక్రమంలో శ్రీ విద్యాలయ స్కూల్ గుండుగొలను పదవ తరగతి విద్యార్థి పాలిన రాంచరణ్ సంజయ్ 589 మార్కులతో స్కూల్ ఫస్ట్ సాధించినందుకు గాను మానవతా సంస్థ వారు ఆ విద్యార్థిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో 11 స్కూల్లకు సంబంధించి స్కూలు ఫస్ట్ వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు స్కూల్ మేనేజ్మెంట్ వారు పాల్గొన్నారు. మానవతా సంస్థ వారిని విద్యార్థి తల్లిదండ్రులు తరఫున శ్రీ విద్యాలయ స్కూల్ మేనేజ్మెంట్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## మన్యం బంద్‌కు వైసీపీ సంపూర్ణ మద్దతు

**- జీఓ నెం 3 పునరుద్ధరణ లేదా ప్రత్యామ్నాయం చూపాలి**

**- కోరాబు అనూష దేవి**



చింతపల్లి, మే 1 (జనస్వరం) : ఆదివాసీ సమాజం హక్కుల కోసం మే 2న చేపట్టనున్న మన్యం బంద్‌కు వైసీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వే శ్వర రాజు ఆదేశాల మేరకు పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలందరూ బంద్‌లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు కేవలం ఓట్ల కోసమేనని మండిపడ్డారు. జీఓ నెం 3ను పునరుద్ధరిస్తామని చంద్రబాబు రా... కదలిరా సభలో హామీ ఇచ్చినప్పటికీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ మాటనూ, ఆ హామీని కూడా మరిచిపోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ డీఎస్సీలో 2000 ఉద్యోగాల్లో 1600 ఉద్యోగాలు గిరిజన యువత కోల్పోయారు. ఇది వారి ఆకాంక్షలకు తూటాగా మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సమాజం హక్కుల కోసం, జీఓ నెం 3ను పునరుద్ధరించాలన్నా, లేదా దానికి సరైన ప్రత్యామ్నాయం చూపించి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్న డిమాండ్‌తో మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ బంద్‌లో గిరిజన సంఘాలు, యువత, ప్రజాసంఘాలు పాల్గొని తమ సంఘీభావం తెలియజేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు



పాలకొల్లు, మే 1 (జనస్వరం) : పట్టణ పరిధిలోని, రెల్లి వీధిలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర సీపీఐ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఏఐటీయూసీ నాయకులు నెక్కంటి సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ జెండాను ఎగురవేసి, అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు ధనాల శ్రీనివాస్, ఆకుల అప్పారావు, ముత్యాల రాంబాబు, ధనాల ఏడు కొండలు, పల్లా దుర్గారావు, రౌతు రాము, మహిళా పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

**ప్రత్తిపాడు నియోజకవర్గం టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్**



శంఖవరం, మే 1 (జనస్వరం) : సాగు చేస్తున్న భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా భూమి సారవంతమై, నాణ్యమైన పంటలతోపాటు, అధిక దిగుబడి సాధించవచ్చని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. మండల కేంద్రం శంఖవరంలోని రైతు సేవా కేంద్రం 3లో మండల వ్యవసాయాధికారి పడాల గాంధీ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ ప్రణాళిక ఖరీఫ్ 2025లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, జనసేన నేత మేకల కృష్ణ హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఎఓ గాంధీ మాట్లడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించి, ప్రోత్సాహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, నవ ధాన్యాల సాగు, పెరటి తోటల పెంపకం, మిద్దె వ్యవసాయం, మిశ్రమ వ్యవసాయం, వివిధ కషాయాల తయారీ వంటి అంశాలపై రైతులకు గాంధీ అవగాహన కల్పించారు. మేకల కృష్ణ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు సాగు చేసిన పంట కంటే ప్రకృతి వ్యవసాయం పద్ధతులతో పండించిన పంటకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించి, పర్వత సురేష్ చేతుల మీదుగా రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేసారు. కార్యక్రమంలో సీఆర్పీ సోమరాజు, పలువురు కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను కాపాడండి

**సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్**




నెల్లూరు. మే 1 (జనస్వరం) : మే డే సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో నగరంలో మేడే జెండాలు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను అణిచివేస్తుందని, ఈమధ్య ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని కార్మిక చట్టాలను, హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్మికులను గాలికి వదిలేసి కార్పొరేటు ప్రైవేటు ఫ్యాక్టరీలకు కొమ్ముకాస్తున్నాయన్నారు. అలా అయితే తొందరలో కార్మికుల మొత్తం ఏకమై దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ నాయకులు మురళి శ్రీనన్న, పీడీఎస్‌యూ నాయకులు ఎం సునీల్, ఎస్కే షారుఖ్, పీఓడబ్ల్యు నాయకులు సరోజనమ్మ వసంతమ్మ, కిష్టమ్మ, శ్యామల తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



నెల్లూరు, మే 1 (జనస్వరం) : సీతారామపురం మండల పరిధిలో 14 పంచాయతీలలోని ప్రతి గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బందితో కలిసి తెలుగుదేశం నాయకులు ఇంటింటికి తిరిగి పింఛన్ దారులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామపురం పంచాయతీ పరిధిలోని పడమటి వీధిలో మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతితో కలిసి వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిడుగు రమేష్ మాట్లాడుతూ వృద్ధులకు తమ జీవితంలో ఆసరాగా ఉండే విధంగా రూ.2వేల పింఛన్‌ని రూ.4వేలకు పెంచి ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకి దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు పేదరికం నుండి బయట పడాలని నిరంతర కృషి చేస్తున్న సీఎంగా రాష్ట్ర ప్రజల మనసుల్లో చంద్రబాబు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి





నెల్లూరు, మే 1 (జనస్వరం) : రూరల్ పరిధిలోని 23వ డివిజన్ వికలాంగుల కాలనీలో గురువారం ఇంటింటికి వెళ్లి అవ్వ తాతలకు పెన్షన్‌లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అంతా ప్రతి నెల 1వ తారీఖున లబ్ధిదారులందరికీ పెన్షన్ అందజేస్తున్న సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి, మంత్రి, యువ నాయకులు నారా లోకేష్‌కి రూరల్ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ పథకాలు అందించడంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వంతో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కొనియాడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసలు రెడ్డి, టీడీపీ నాయకులు మేకల మధు, పుల్లారెడ్డి, పాముూరు సుధాకర్ రెడ్డి, నన్నం శ్రీనివాసులు, భూలక్ష్మి, చల్ల సుబ్బన్న, మస్తాన్ రెడ్డి, చిన్న మల్లికార్జున్, బాపూజీ, మల్లికార్జున్ రెడ్డి, మురళీ, కేశవులు, శివ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధి కోసం రోజుకి 18 గంటలు పనిచేసే కార్మికుడు సీఎం చంద్రబాబు

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- సిద్దార్థహొటల్ మేనేజ్మెంట్ కాలేజీ గ్రౌండ్‌లో ఘనంగా టీఎన్‌టీయూసీ మేడే వేడుకలు
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** టీడీపీలో కార్మికులకు, మేడేకి ప్రత్యేకత వుంది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ సీఎం నందమూరి తారకరామారావు కార్మిక శ్రామికులను పార్టీలో భాగం చేశారు. పార్టీ జెండా గుర్తులో ఎన్టీఆర్ చక్రం, నాగలి కార్మిక, కర్షకలకు చిహ్నంగా పెట్టారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం ఒక కార్మికుడిలా నిత్యం 18 గంటలు పాటు అలుపెరగకుండా శ్రమిస్తున్నాడని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో సిద్దార్థ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మేడే వేడుకలు ఎంపీ కేశినేని శివనాథ్ హాజరు కాగా, ఇంకా ఈ కార్యక్రమానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్, మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీలతో పాటు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కార్మికులకు ఎప్పుడు భద్రత ఉంటుందని తెలియజేస్తూ కార్మికు సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలనలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన డాక్టర్ అంబేద్కర్ కార్మికుల కోసం 8 గంటల పనిదినంతో పాటు ఎన్నో పథకాలు కార్మికులకోసం ప్రవేశపెట్టారు. ఆయన స్ఫూర్తితో సీఎం చంద్రబాబు అసంఘటిత కార్మికుల కోసం 26 శాఖలతో ఒక ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే గత ప్రభుత్వం ఆ ఫెడరేషన్‌ను రద్దు చేసిందన్నారు.. తిరిగి ఆ ఫెడరేషన్‌ను పునరుద్దరించే కార్యక్రమం సీఎం చంద్రబాబు చేపట్టారని తెలిపారు. ఈ ఫెడరేషన్ వల్ల అసంఘటిత కార్మికులకి మెడికల్ ఇన్స్యూరెన్స్, వారి పిల్లలకు విద్య వైద్య వంటి సదుపాయాలు లభించే విధంగా కృషి చేశారన్నారు. భవననిర్మాణ రంగంలో వున్న అసంఘటిత కార్మికులు గత ప్రభుత్వం ఇసుక లభించక ఇబ్బందులు పడితే ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ఇసుక విధానం అమల్లోకి రావటంతో భవన నిర్మాణ కార్మికులకి పనులు లభిస్తున్నాయన్నారు. మేడే సందర్భంగా విజయవాడలో టీఎన్‌టీయూసీ జెండాలు రెపరెపలాడటానికి టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు కృషే కారణమన్నారు. టీఎన్‌టీయూసీ బలోపేతం చేయటానికి, గత ప్రభుత్వం దుర్మార్గ పాలనపై పోరాట చేసే విషయంలో ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేశారని కొనియాడారు.

## పొట్నూరి ఫౌండేషన్ ఆవిర్భావం

**ప్రారంభించిన మంత్రి రామానాయుడు**



**పాలకొల్లు, మే 1 (జనస్వరం) :** పట్టణంలోని 28వ వార్డు మాజీ కౌన్సిలర్ పొట్నూరి అప్పన్న భవానీ, తన తండ్రి పేరున సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా "పొట్నూరి ఫౌండేషన్"ను ఏర్పాటు చేశారు. గురువారం పొట్నూరి ఫౌండేషన్‌ను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ తరపున ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కర్నేన దంపతులు ప్రారంభించారు. అదేవిధంగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, పేద మహిళలకు 25 కిలోల బియ్యం, ఇతర నిత్య అవసరాలు ఉచితంగా ఫౌండేషన్ తరపున అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కర్నేన రోజారమణి గౌరు నాయుడు దంపతులు అతిథులుగా హాజరయ్యారు. మాజీ కౌన్సిలర్ పొట్నూరి భవానీ, లోపింటి చిరంజీవి, కరుమజ్జి సత్యనారాయణ, కడలి అప్పారావు, పొట్నూరి శ్రీనివాస్, కెల్ల లక్ష్మీనారాయణ కుటమి నాయకులు పాల్గొన్నారు

## రాష్ట్రానికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ తీర్చిదిద్దటమే కూటమి లక్ష్యం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- తిరువూరు వేముల హేమలత రూ.3లక్షల ఎల్‌ఓసీ మంజూరు
- బాధితురాలు తండ్రికి ఎల్‌ఓసీ అందజేత



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** రాష్ట్రంలోని ప్రజలందరీ సంక్షేమం, అభివృద్ధితో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా ఎన్డీఏ కూటమి లక్ష్యమని.. ఆ విధంగానే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తిరువూరు టౌన్ 5వార్డ్ అధ్యక్షుడు వేముల ఏడుకొండలు తన కుమార్తె వేముల హేమలత వైద్య చికిత్స నిమిత్తం తక్షణ ఆర్థిక సాయంకై లెటర్ ఆఫ్ క్రెడిట్ కోసం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సాయంతో ఆర్జీ పెట్టుకున్నారు. మంజూరైన రూ.3 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని వేముల ఏడుకొండలకు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి మాదల హరిచరణ్ (కిట్టు), తిరువూరు పట్టణ 15వ వార్డ్ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, తిరువూరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, తెలుగు దేశం నాయకులు వేముల చక్రవర్తి పాల్గొన్నార్ను.

## పెద్దూరు, పెద్దిరాజుపాలెం గ్రామాల్లో ఘనంగా జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ



**పాయకరావుపేట, మే 1 (జనస్వరం) :** మండలంలోని పెద్దూరు గ్రామ శాఖ అధ్యక్షులు సురేష్, పెద్దిరాజుపాలెం గ్రామ శాఖ అధ్యక్షులు నక్క సాంబయ్యల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో గురువారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ గెడ్డం బుజ్జి మాట్లాడుతూ జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ అంటే జనసైనికులందరికీ పండుగ వంటిదన్నారు. పార్టీ ఔన్నత్యం కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గెడ్డం బుజ్జి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వీర మహిళలు పలువురు జనసేన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ చీఫ్ గెడ్డం బుజ్జిని పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు యగదాసు నానాజీ, పట్టణ శాఖ అధ్యక్షులు ఆచంట దొర, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు జగ్గన్నదొర, ఆ పార్టీ నాయకులు గణపతి దొరబాబు, బావరాజు, గోల్ల సన్యాసి రావు, నారపుడ్డి జోగిరాజు, తుమ్మల గణేష్, వెలుగుల స్వామి, గరికిన శ్రీను, కొంఢ్ర శివ, మామిడి లోవరాజు, గరికిన కొండబాబు, చొక్కా రాజేష్, ముత్తి కిరణ్ కుమార్, ముత్తి ప్రసాద్, చొక్కా జాను కోడా జ్యోతి కుమార్, సిద్దు, సురాడ చంద్రశేఖర్, చొక్కా కాశిబాబు, కిల్లాడ ఏసు సహా జనసైనికులు, వీర మహిళలు పలువురు పాల్గొన్నారు.

## టెన్త్ టాపర్ మురళీను అభినందించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**శంఖవరం, మే 1 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూలు (ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల) విద్యార్థి ఎద్దు బాల మురళీ టెన్త్ పరీక్ష ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ అభినందించారు. బాల మురళీ టెన్త్ ఫలితాల్లో 600 మార్కులకు గానూ 584 మార్కులు సాధించి, శంఖవరం మండలంలో టాపర్‌గా నిలిచాడు. టెన్త్ టాపర్లను జిల్లా కేంద్రం కాకినాడలోని కలెక్టరేట్‌లో వివేకానంద హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో బాల మురళీని కలెక్టర్ షణ్మోహన్ శాలువా కప్పి సత్కరించి, ఒక మంచి పుస్తకాన్ని, రూ.10వేలు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో డిఇఓ పి రమేష్, మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ డా. వైఎస్వీ కిరణ్, యూటీఎఫ్ నేత తోట సీతారామయ్య, బాల మురళీ తల్లి సుబ్బలక్ష్మి హాజరయ్యారు. అనంతరం మండలం ఎంఇఓలు ఎస్వీ రమణ, గోవిందు, ఉపాధ్యాయులు బాల మరళీని అభినందించారు.

## దుర్గమ్మ ఆశీస్సులతో అమరావతి పునః నిర్మాణ పనులు విజయవంతం కావాలి

- ప్రధాని మోదీ అమరావతి పర్యటన భావితరాలకు భవిష్యత్తు కావాలి
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో అమరావతి.. పోలవరం పూర్తి కావాలి
- విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో అమరావతి పునః నిర్మాణ పనులు విజయవంతం కావాలని, అమరావతి పునః ప్రారంభ పనులకు శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని, ఏపీలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కావాలని దివంగత సీఎం, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తనయుడు రామకృష్ణ ఆకాంక్షించారు. అమరావతి పునః ప్రారంభ పనుల శంకుస్థాపనలో పాల్గొనేం దుకు గురువారం విజయవాడ వచ్చిన రామకృష్ణ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు రామకృష్ణకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించి అమ్మవారి శేషవస్త్రాలతో రామకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజారాజధారి అమరావతి పునఃనిర్మాణ పనులకు మోదీ శుక్రవారం అమరావతికి వస్తున్నారని, ఆయన పర్యటన విజయంతం కావాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో రాజధాని నిర్మాణం పూర్తి కావాలని, ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, తద్వారా ఏపీ అన్నపూర్ణగా రూపుదిద్దుకోవాలని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తెలుగుదేశం పార్టీ, తమ తండ్రి ఎన్టీఆర్ ఆశయాల సాధనకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో ఏపీ అన్నివిధాలా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. స్వర్ణాంధ్రగా ఏపీ రూపుద్దికోవాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కలలు సాకారం కావాలని, ప్రజాశీస్సులతో స్వర్ణాంధ్ర-2047 ద్వారా లక్ష్యాన్ని సాధించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామకృష్ణ వెంట రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, వీరమాచనేని శివప్రసాద్ వల్లూరు కిరణ్ తదితరులు ఉన్నారు.

## లయన్స్ మల్టీకాన్ విజయవంతం కావాలి

**బ్రోచర్ను ఆవిష్కరించిన చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి**



**పాలకొల్లు, మే 1 (జనస్వరం) :** లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 316 ఆధ్వర్యంలో ఈ నెల మూడు నాలుగు తేదీల్లో స్థానిక అడబాల గార్డెన్స్‌లో నిర్వహించు మల్టీకాన్ 9వ యాన్యువల్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కన్వెన్షన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సిహెచ్. సత్యనారాయణ మూర్తి (బాబ్జి) విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రం స్థానిక అడబాల గార్డెన్స్ ప్రాంగణంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ ఆంధ్ర రీజియన్‌లో ఆరు జిల్లాలకు సంబంధించి ప్రతి ఏడాది యాన్యువల్ కన్వెన్షన్ నిర్వహిస్తుంటామని రెండు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతోపాటు రాష్ట్రానికి సంబంధించిన లయన్స్ ప్రముఖులు హాజరవుతారని, ఆరు జిల్లాలకు సంబంధించిన జిల్లా గవర్నర్లు, పూర్వపు జిల్లా గవర్నర్లు, నామినేటెడ్ జిల్లా గవర్నర్లు తదితరులు హాజరవుతారని డాక్టర్ బాబ్జి వివరించారు. ఆరు జిల్లాలలో సుమారు 13,600 మంది లయన్స్ ప్రతినిధులు, సభ్యులు 394 క్లబ్బుల ద్వారా తమ సేవలు అందిస్తుంటారని, 3, 4 తేదీల్లో నిర్వహించు కన్వెన్షన్‌కు సుమారు 1000 మంది హాజరవుతున్నట్లు డాక్టర్ బాబ్జి వెల్లడించారు. ఈ సందర్భంగా కన్వెన్షన్‌కు సంబంధించిన మల్టీకాన్ బ్రోచర్‌ను లయన్స్ ప్రతినిధుల సమక్షంలో డాక్టర్ బాబ్జి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి మేకా శ్రీరామ్ సురేష్, జిల్లా గవర్నర్ ఎలెక్ట్ ఎన్విపిఎస్ పాపారావు నాయుడు, జోన్ చైర్ పర్సన్ ఎన్‌ఎ అన్నపూర్ణ (అరుణ), క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కె.జయభారతరెడ్డి, ప్రతినిధులు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ సిరిగినీటి రాజ్యలక్ష్మి, కొమ్ముల మురళీ కృష్ణ, ముచ్చర్ల సత్యనారాయణ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై బురద జల్లే రాజకీయాలు మానుకోండి : బీటెక్ రవి



**పులివెందుల, మే 1 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం పై అవాస్తవ ఆరోపణలు చేయడం మానుకోవాలని టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఎంపీ అవినాష్ రెడ్డిని హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, "మీ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు," అని ఆయన మండిపడ్డారు. పులివెందుల ప్రాంతంలో తుఫానుతో నష్టపోయిన అరటి రైతులకు కూటమి ప్రభుత్వం హెక్టర్‌కు రూ. 35,000 నష్టపరిహారం, మొక్కలు నాటేందుకు హెక్టర్‌కు రూ.75,000 ఇవ్వాలని నిర్ణయించిందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సన్నద్ధంగా ఉందని తెలిపారు. అవినాష్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ, గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయలేదని, ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు సాయం చేయలేకపోయిందని విమర్శించారు. అంతేకాక, అరటి రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించలేదని గుర్తు చేశారు. "మీ ప్రభుత్వం పులివెందులను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పి, అభివృద్ధి పనులు లేకుండా విచ్చలవిడిగా దోచుకుందన్నారు. రైతులకు ఉపయోగపడే కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలపై దృష్టి పెట్టలేదు," అని బీటెక్ రవి ఆరోపించారు. పులివెందుల ప్రజల సమస్యలపై అవినాష్ రెడ్డి చిత్తశుద్ధితో స్పందించలేదని, 10 నెలలుగా కనీసం పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రయత్నించలేదని ఆయన విమర్శించారు. "పులివెందుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి సిద్ధమని చెబుతున్నాం, కానీ అవినాష్ రెడ్డి మాత్రం ముందుకు రావడం లేదు," అని చెప్పారు. అవినాష్ రెడ్డి కుటుంబంపై కూడా బీటెక్ రవి విమర్శలు గుప్పించారు. "మీ అన్న అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు గుర్తు రాలేదు. అధికారం పోయాక మాత్రం నాటకీయ రాజకీయాలు చేస్తున్నారు," అని ఆరోపించారు.

**పేర్లు మార్చడం వైసీపీ ప్రభుత్వానికి అలవాటు :**

"ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా మార్చడం, కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా మారు పేరు పెట్టడం మీ అధికారంలోనే జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రం 'వైఎస్ఆర్ కడప జిల్లా' అని సవరించాం. ఇది తేడా," అని బీటెక్ రవి స్పష్టం చేశారు.

**లిక్కర్ స్కాంపై తీవ్ర ఆరోపణలు :**

బీటెక్ రవి ఇంకా ఆరోపిస్తూ, "మీ ప్రభుత్వ హయాంలో మద్యపాన నిషేధం పక్కా చేయలేదు. లిక్కర్ స్కాం జరిగి, ఇప్పటికే సీఐడీ విచారణలో రాజ్ కసి రెడ్డి, చాణిక్య రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి లాంటి వారిని అరెస్టు చేశారు. త్వరలో మరిన్ని అరెస్టులు జరగనున్నాయి," అని హెచ్చరించారు.

## ఒకే రోజు ఫించన్ పెంపు చరిత్రాత్మక నిర్ణయం

**వృద్ధులకు ఫించన్ సొమ్ము అందజేసిన మంత్రి రామానాయుడు**



**పాలకొల్లు, మే 1 (జనస్వరం) :** సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఒకే రోజున పెద్ద ఎత్తున ఫించన్ సొమ్మును పెంచి పింఛన్ లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి సకాలంలో అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం మండలంలోని పూలపల్లి గ్రామంలో వృద్ధులకు ఆయన ఫించన్ సొమ్మును స్వయంగా అందజేశారు. ఇంటి అరుగు మీద కూర్చున్న వృద్ధురాలి యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగుందా అంటూ పలకరించారు. చంద్రబాబు మీ పింఛన్ సొమ్మును పంపారని, తీసుకోవాలని కోరుతూ, రూ.4వేలను సదరు వృద్ధ మహిళలకు స్వయంగా మంత్రి రామానాయుడు అందజేశారు. మరో ఇద్దరికి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో కలిసి పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు రూ.3వేలు నుంచి రూ.4 వేలుకు, దివ్యాంగులకు రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు, మంచం మీద ఉన్న వారికి రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు, స్థితిని బట్టి రూ.15 వేలు చొప్పున పెంచి అందిస్తున్న ఘనత ఒక్క టీడీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. మాజీ సీఎం జగన్‌కు ఒక వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని ప్రజలది గమనించాలని గుర్తు చేశారు. పనిచేసే ప్రభుత్వానికి, పనిచేయని ప్రభుత్వానికి తేడా ఇదే నని ఇల్లు, ఈ తేడాను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో తమ సీఎం చంద్ర బాబుకు నిరాదరణకు గురైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పట్ల ప్రేమ, మానవత్వం ఉం దన్నారు. నాడు జగన్ రంగుల మీద పెట్టిన శ్రద్ధ వృద్ధులు వితంతువులు దివ్యాంగులపై పెట్టలేదని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి నెలకు మూడు రూ.3వేల కోట్లు చొప్పున ఖర్చు అవుతుందని, ఈ లెక్కన ఐదేళ్లకు రూ.1,80,000 కోట్లు ఖర్చు పెడుతున్నామని వివ రించారు. సీఎం చంద్రబాబు పేదవాడి ఇంటి గుమ్మం దగ్గరకు వెళ్లి పెన్షన్ సొమ్మును స్వయంగా అందిస్తున్నారని గతంలో ఏ సీఎం ఈ విధంగా చేయలేదని మంత్రి తెలిపారు. చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని వర్గాల ప్రజ లకు మేలు చేయాలని ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమం దిశగా మంచి పాలన అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, ఎంపీడీఓ ఉమామహే శ్వరరావు, గ్రేట్ వన్ పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీను, ఎలక్ట్రికల్ ఏఈ వేగేశ్న శ్రీహరి రాజు, గుబ్బల హరిప్రసాద్, ఉనికల నాగేశ్వరరావు, పాలపర్తి చాంద్ రాజు, గోనేడ రామకృష్ణ, గబ్బడి నరసింహారాజు ఇతర ముఖ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు

## డాక్టర్ యర్రంశెట్టి నూతన పరిశోధన పత్రానికి "అత్యుత్తమ రీసెర్చ్ పేపర్ అవార్డు"



**అమలాపురం, మే 1 (జనస్వరం) :** అహ్మదాబాద్‌కు చెందిన "జర్నల్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇన్నోవేటివ్ రీసెర్చ్" జర్నల్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగధిపతి డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి సమర్పించిన "ది సింబయోటిక్ రిలేషన్షిప్ బిట్వీన్ ఎలక్ట్రానిక్స్, వై -ఫై ఇన్ డ్రైవింగ్ మోడరన్ టెక్నాలజీ" పరిశోధన పత్రం అత్యుత్తమ రీసెర్చ్ పేపర్ అవార్డును కైవసం చేసుకుంది. ఆ జర్నల్ కు ముఖ్య సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్యులు హితేష్ పాటిల్, పారిన్ పాటిల్ గురువారం డాక్టర్ యర్రంశెట్టికి ఆ విషయాన్ని తెలియజేసారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 15న ఆయన రీసెర్చ్ పేపర్ ఆ జర్నల్లోని వాల్యూం 12, ఇష్యూ 4లో 620వ పేజీ నుంచి 629వ పేజీ వరకు ప్రచురితమయ్యింది. ఆయా రాష్ట్రాలకు చెందిన సుమారు 130 మంది ప్రముఖ పరిశోధకులు సమర్పించిన రీసెర్చ్ పేపర్ల లో డాక్టర్ యర్రంశెట్టి రీసెర్చ్ పేపర్లో 93 శాతం నూతన అంశాలను చేర్చిన కారణంగా ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలియజేసారు. అలాగే రీసెర్చ్ ప్రచురిత ధ్రువీకరణ పత్రాన్ని, అత్యుత్తమ రీసెర్చ్ పేపర్ అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ పరిశోధనలో భౌతిక శాస్త్రం లో ఎలక్ట్రానిక్స్ విభాగం, వై-ఫై సాంకేతికకు ముడిపడి ఉన్న అవినావ సంబంధాన్ని, వాటి అభివృద్ధిని పొందు పరిచినట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, మైక్రోప్రాసెసర్లు, సెన్సార్ టెక్నాలజీలలో పురోగతులు వై-ఫై సామర్థ్యాల విస్తరణకు ఎలా ఆజ్యం పోశాయో నొక్కి చెప్పారు. హై-స్పీడ్ వైర్‌లెస్ యాక్సెస్ కోసం పెరుగుతున్న డిమాండ్ కారణంగా స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సిస్టమ్స్, స్మార్ట్ హోమ్ ఎలక్ట్రానిక్ పరికరాల రూపకల్పనకు, ఆవిష్కరణలను ప్రభావితం చేస్తుందన్నారు. సెమీకండక్టర్ టెక్నాలజీలో పురోగతులు, ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్ల అధునాతనత నిరంతర సూక్ష్మీకరణ, వై- ఫై భాగాల యొక్క మెరుగైన శక్తి సామర్థ్యాన్ని మెరుగుపర్చడం లో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇప్పటి వరకు ఆయన 14 రీసెర్చ్ పేపర్ల ను ఆయా జర్నల్లకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర, ఆదికవి యూనివర్సిటీలు, జేఎన్టీయూకే పూర్వపు వీసీ సుంకర రామకృష్ణారావుతో పాటుగా రాష్ట్రంలో పలు యూనివర్సిటీల రిజిస్ట్రార్లు, అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేసారు.

# శ్రామికులతోనే దేశ ప్రగతి

**- అభివృద్ధికి ఉపాధి పథకం వెన్నెముక**

**- ఉపాధి శ్రామికుల సంక్షేమానికి కట్టుబడతాం**

**- ఉపాధి కూలీలు ఇకపై ఉపాధి శ్రామికులు**

**- కండలు కరిగించేవారుంటేనే కట్టడాలు**

**- ఉపాధి శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

**- శిథిల ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా పంచాయతీరాజ్ నిధులు**

**- గత ఏడాది 10,669 కోట్లు ఖర్చు చేశాం**

**- 24.23 కోట్ల పనిదినాలు కల్పించాం**

**- ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్**



**అమరావతి, మే 1 (జనస్వరం) :** వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పంచాయతీరాజ్ నిధులే ప్రాణ వాయువులా మారాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకలా నిలుస్తోందని చెప్పారు. గురువారం మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మేడే సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రామికులు లేకపోతే దేశ ప్రగతి ముందుకు సాగదని చెప్పారు. దేశ అభివృద్ధిలో భాగమవుతున్న ప్రతి శ్రామికుడికి అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మేడే సందర్భంగా నేటి నుంచి ఉపాధి హామీ పథకం కూలీలు అనే పేరును, ఉపాధి హామీ శ్రామికులుగా మారుస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 10,669 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అందులో రూ. 6,194 కోట్లు వేతనాలకే ఖర్చు చేశామని, రూ. 4,023 కోట్లు మెటీరియల్ కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. 75.23 లక్షల కార్మికులకు సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించామని వెల్లడించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 24.23 కోట్ల పనిదినాలు కల్పించామని, 5.10 లక్షల కుటుంబాలకు వందరోజుల పాటు పని కల్పించామని చెప్పారు. లంచాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల గతంలో రూ. 150లు మించని వేతనాలు ఇప్పుడు రూ. 307కి పెంచి ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. "ఇంజనీర్లు, సైంటిస్టులు, డాక్టర్లు ఎంత గొప్పో పనిచేసే ప్రతి శ్రామికుడు కూడా అంతే గొప్పే. మీకు ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది. పంచాయతీరాజ్‌శాఖ తీసుకోవడం వెనుక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మినహా ఇతర కారణాలు లేవు. ఐదేళ్లలో మీకు ఎంత వరకు మద్దతుగా నిలవగలం అనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నాం. విష్ణుమూర్తి గజేంద్రుని రక్షించినట్లు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి అధికారులు పూనుకున్నాం.

**పల్లెపండుగలో 21 వేలకుపైగా గోకులాలు :**

పల్లె పండుగ ద్వారా ఇప్పటి వరకు రూ. 377.37 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 21,564 గోకులాలు పూర్తి చేశాం. ఉపాధి శ్రామికుల కష్టం ఫలితంగా గ్రామాల్లో రూ. 60.75 కోట్లు ఖర్చుతో 13,500 పశువుల తొట్టెలు పూర్తిచేశాం. అలాగే రూ. 317.91 కోట్లు ఖర్చుతో 63,582 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాం. ఒకే రోజు 1.21 కోట్ల మంది ఉపాధి శ్రామికులకు ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి యోజన పథకాల కింద బీమా నమోదు చేశాం. పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి. శ్రామికులకు పూర్తివేతనం అందే లా అన్ని చర్యలు చేపట్టాం. ఉపాధి వేతనాలు పెరిగే లా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

**నీటి సంరక్షణకు చర్యలు :**

రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలంటే దాదాపు రూ. 87 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనాతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించాం. వాళ్లు పరిశీలించి ఇప్పటి వరకు రూ. 29 వేల కోట్లకు అనుమతులిచ్చారు. పూర్తి స్థాయిలో పనులు చేయాలంటే ఇంకో రూ. 57 వేల కోట్లు అవసరం. మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వ పాలకులు.. సారాయి సాణువుల మీద కూడగట్టుబెట్టుకున్నారు. మద్యం తయారుచేసి, అమ్మి దాదాపు రూ. 3,200 కోట్లు దోచుకున్నారని ఇప్పటివరకు తెలిసింది" అని పవన్ చెప్పారు. అంతకు ముందు పవన్‌కల్యాణ్ ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముక్ కుమార్, సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్, ఏసీ శివప్రసాద్, జేడీ సునీత తదితరులు పాల్గొన్నారు.

**1.21 కోట్ల ఉపాధి శ్రామికులకు బీమా :**

ఉపాధి శ్రామికుల కుటుంబాలకు భరోసా కల్పించాలనే పవన్ కల్యాణ్ సూచనలతో కమిషనర్ కృష్ణతేజ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో శ్రామికులందరినీ నమోదు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద మే ఒకటో తేదీ ఒక్క రోజే 94 లక్షల మంది నమోదయ్యారని, అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద 27 లక్షల మంది నమోదు అయ్యారని మొత్తంగా 1.21 కోట్ల మంది ఉపాధి శ్రామికులకు బీమా సౌకర్యం దక్కిందని అధికారులు తెలిపారు.

**పీ4 ద్వారా ఆదుకోండి :**

ఉపాధి శ్రామికులు పలువురు పవన్‌కల్యాణ్‌తో ముచ్చటించారు. తాను, తన భర్త దివ్యాంగులమేనని, తమను పీ4 ద్వారా ఆదుకోవాలని పల్నాడు జిల్లాకు చెందిన చెంచు భూలక్ష్మి కోరారు. ఖుషి సినిమా పోస్టర్ తమ దేవుడి ఇంట్లో ఉంటుందని తెలిపారు. కుప్పం నుంచి వచ్చిన రామప్ప అనే ఉపాధి శ్రామికుడు మాట్లాడుతూ.. తాను ఉపాధి పథకం ద్వారా పూలతోటలు పెంచి రూ. 30 వేలు ఆదాయం గడించానని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మల్లేశ్ మాట్లాడుతూ వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే బాగుంటుందని సూచించారు. దీనిపై పవన్ మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా ఈ డిమాండ్ ఉందన్నారు. ఈ విషయం కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన శ్రామికులు చెప్పిన వివరాలను పవన్ సావధానంగా విన్నారు. అనంతరం ఆయన ఉపాధి శ్రామికులతో ఫొటోలు దిగారు. "గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు. నాకు పల్లెలు అంటే ఇష్టం. గ్రామాలు బాగుండాలని నిరంతరం ఆకాంక్షిస్తాను. శ్రమ విలువ నాకు తెలుసు కాబట్టి ఉపాధి శ్రామికుల విలువ తెలుసు. కండలు కరిగించేవారు లేకపోతే కట్టడాలు ఉండవు. హరితహారాలు ఉండవు. అందుకే శ్రమపడేవారిని దేశాన్ని, రాష్ట్రాన్ని నిర్మించే శ్రామికులుగా గుర్తించాలి. కార్మిక దినోత్సవాన మిమ్మల్ని ఉపాధి కూలీలుగా కాకుండా దేశ నిర్మాణంలో చమటోడ్చే శ్రామికులుగా గుర్తిస్తున్నాం. ఈ రోజు నుంచి మిమ్మల్ని ఉపాధి శ్రామికులుగానే పిలుస్తాం."



## ప్రధాని వస్తుంటే జగన్ జంప్

**- ఒకరోజు ముందే బెంగళూరుకు చెక్కేసిన మాజీ సీఎం**

**- అమరావతి పనుల శ్రీకారానికి ప్రత్యేకంగా ఆహ్వానించిన ప్రభుత్వం**

**- రాజధాని పనుల పురోగతి ఓర్వలేకనే డుమ్మా**

**అమరావతి, మే 1 (జనస్వరం) :** మూడు ముక్కలాటతో తాను విధ్వంసం చేసిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి.. ఇప్పుడు పునర్నిర్మాణం దిశగా పరుగులు పెట్టడం చూసి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారు. పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు స్వయంగా ప్రధాని మోదీ వస్తుంటే.. ఆయన సభకు హాజరుకాకుండా బెంగళూరు యలహంక ప్యాలెసకు వెళ్లిపోయారు. ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు రావాలని రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా జగన్‌కు ఆహ్వానం అందజేసింది. తాను ఐదేళ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు మోదీ అందించిన సహకారానికి కృతజ్ఞతగానైనా.. ఈ సభకు జగన్ హాజరు కావాలని కోరింది. దేశ ప్రధాని హోదాలో రాష్ట్రానికి వస్తున్న మోదీని మర్యాదపూర్వకంగానైనా కలిసి స్వాగతం పలకాల్సి ఉండగా.. జగన్ ముఖం చాటేసి ఒక రోజు ముందే బెంగళూరు వెళ్లిపోవడంపై రాజకీయ వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం అనంతరం జగన్ ప్రతి శుక్రవారం యలహంక ప్యాలెస్‌కు వెళ్లిపోతున్నారు. సోమవారం రాత్రి గానీ, లేదంటే మంగళవారం గానీ వస్తున్నారు. అయితే అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధాని వస్తుండడం.. రాష్ట్ర ప్రజలంతా భారీ సంఖ్యలో సభకు హాజరు కానుండడం.. వారికి ముఖం చూపించలేక పర్యటనను బహిష్కరించి.. ఒకరోజు ముందే బెంగళూరుకు వెళ్లిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## రెండో ఉచిత సిలిండర్ సబ్సిడీ విడుదల

**అమరావతి, మే 1 (జనస్వరం) :** 'దీపం-2' పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రెండో ఉచిత గ్యాస్ సిలిండరును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.867 కోట్ల నిధులను విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి జూలై మధ్యకాలంలో అందించే ఈ రెండో ఉచిత సిలిండర్‌కు సంబంధించిన సబ్సిడీ నిధులను రాష్ట్ర ఆర్థిక శాఖ సంబంధిత సంక్షేమ శాఖల (కార్పొరేషన్లు)కు కేటాయించింది. ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.16,330 లక్షలు, ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.3,870 లక్షలు, బీసీ సంక్షేమ శాఖకు రూ.46,522 లక్షలు, ఈడబ్ల్యూఎస్ విభాగానికి 14,582 లక్షలు, మైనారిటీ సంక్షేమ శాఖకు 5,396 లక్షలు చొప్పున కేటాయించింది. ఈ బడ్జెట్ వినియోగంపై తగిన మార్గదర్శకాలను సూచిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

**చీఫ్ విజిలెన్స్ అధికారిగా రంగకుమారి :**

పౌరసరఫరాల శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారిగా కె.రంగకుమారిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె చాలాకాలంగా కమిషన్ కార్యాలయంలో అదనపు డైరెక్టరుగా సేవలందిస్తున్నారు.

## కసిరెడ్డికి సిట్ కస్టడీ



**విజయవాడ, మే 1 (జనస్వరం) :** మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి)కి న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఆయన్ను వారం రోజులపాటు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారణకు అనుమతించింది. సిట్ అధికారులు శుక్రవారం ఉదయం రాజ్ కసిరెడ్డిని జైలు నుంచి కస్టడీకి తీసుకుంటారు. ఏడు రోజులు ప్రశ్నించనున్నారు. మరోవైపు.. లిక్కర్ కేసులో అరెస్టయి విజయవాడ జిల్లా జైలులో ఉన్న కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి తమకు 'బి' క్లాస్ సెల్ ఇవ్వాలని గురువారం కోర్టులో మెమో దాఖలు చేశారు. అదేవిధంగా ఇంటి నుంచి భోజనాన్ని కూడా అనుమతించాలని కోరారు. దీనిపై విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారానికి వాయిదా వేశారు.

## పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌యూ నోటిఫై

**అమరావతి, మే 1 (జనస్వరం) :** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కేంద్రీకృతం చేస్తూ ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ)ను నోటిఫై చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రస్థాయిలో సీఆర్‌యూను ఏర్పాటు చేసింది. దీని కార్యకలాపాలు గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యాయి. పన్ను నిర్వహణలో సమర్థత, ప్రభావవంతమైన పనితీరు కనిపిస్తుండటంతో ఈ సీఆర్‌యూను కొనసాగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధాన కమిషనర్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. నిశితంగా పరిశీలించిన సర్కారు దానిని నోటిఫై చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

## రిమాండ్ ఉత్తర్వులు కొట్టేయండి

**- హైకోర్టులో ఐపీఎస్ పీఎస్సార్ పిటిషన్**

**- కౌంటర్‌కు సమయం కోరిన ప్రాసిక్యూషన్**

**అమరావతి, మే 1 (జనస్వరం) :** ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో తనపై సీఐడీ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేయాలని సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎసఆర్ ఆంజనేయులు హైకోర్టును కోరారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసు పెండింగ్‌లో ఉండగా.. జెత్వానీ ఫిర్యాదుతో కేసు పెట్టడానికి వీల్లేదన్నారు. విచారణకు రావాలని పోలీసులిచ్చిన నోటీసులకు స్పందించలేదనే కారణంతో పిటిషనర్‌కు ట్రయల్ కోర్టు రిమాండ్ విధించిందని.. వ్యక్తిగత స్వేచ్ఛతో ముడిపడి ఉన్నందున వ్యాజ్యంపై సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్.. విచారణను ఈ నెల ఆరో తేదీకి వాయిదా వేశారు.

**ఐపీఎస్‌ల క్వాష్ పిటిషన్లపై విచారణ 8కి వాయిదా**

నటి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, అప్పటి ఏసీపీ కె.హనుమంతరావు, దర్యాప్తు అధికారి కె.సత్యనారాయణ వేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు 8కి వాయిదా వేసింది. గురువారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా ప్రాసిక్యూషన్ తరఫున ఏజీ వాదనలు వినిపించారు. పిటిషనర్లు ఇప్పటికే ముందస్తు బెయిల్ పొందారని.. ప్రస్తుత కేసులో నోటీసులిచ్చి విచారణకు పిలువబోమని, తుది చార్జిషీటు దాఖలు చేయబోమని గతంలోనే హామీ ఇచ్చామని గుర్తుచేశారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు స్పందిస్తూ.. మరో కేసులో (కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసు) నోటీసులిచ్చి విచారణకు పిలుస్తున్నారని.. తదుపరి చర్యలపై స్టే విధించాలని కోరారు. ఏజీ జోక్యం చేసుకుంటూ.. ప్రస్తుత కేసులో పిటిషనర్లకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని.. ఇచ్చి ఉంటే వాటిని కోర్టు ముందుంచాలన్నారు. మరో కేసులో విచారణకు రమ్మని కోరితే తప్పేమందని ప్రశ్నించారు. వ్యాజ్యాలపై కౌంటర్ వేస్తామని, విచారణను 8వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి హరినాథ్ అప్పటికి వాయిదావేస్తూ ఉత్తర్వులిచ్చారు.

**జెత్వానీపై నేనెవరికీ ఆదేశాలివ్వలేదు**

**జైలులో సదుపాయాలు కల్పించండి: పీఎస్సార్**

ముంబై నటి కాదంబరి జెత్వానీపై కేసు వ్యవహారంలో తాను ఏ అధికారికీ ఎలాంటి సూచనలు, ఆదేశాలూ ఇవ్వలేదని అప్పటి నిఘా విభాగం చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు స్పష్టంచేశారు. బెయిల్ కోసం, జైల్లో సదుపాయాల కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విజయవాడ మూడో అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. ఆయన తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. ఈ కేసులో పీఎస్సార్‌కు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఈ కేసు విషయంలోనే ఆయన అప్పటి సీఎంవోకు వెళ్లారన్న ఆరోపణల్లో కూడా వాస్తవం లేదని తెలిపారు. ఆయన డీజీ స్థాయి అధికారి అయినందున జైలులో తగు సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం కోర్టు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## బ్రిజేశ్ ట్రైబ్యునల్ తీర్పుపై రాష్ట్రాలతో 7న కేంద్రం భేటీ

**తీర్పును ప్రచురించేందుకు అభిప్రాయ సేకరణ**



**హైదరాబాద్, మే 1 (జనస్వరం) :** కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2) వెలువరించిన తీర్పును నోటిఫై చేయడానికి వీలుగా రాష్ట్రాల అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 7న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రభావిత రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో సమావేశం కానున్నారు. కృష్ణా జలాల పంపిణీపై 2013 నవంబరు 29న ట్రైబ్యునల్-2 అవార్డు వెలువరించింది. దీనిని ప్రచురితం(కేంద్రం నోటిఫై) చేయొద్దని కోరుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసింది. తెలంగాణ ఏర్పడ్డాక ఆ రాష్ట్రం కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. ఈ తీర్పుపై విచారణ జరుగుతున్న క్రమంలో కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి వీలుగా కేంద్రం విధి విధానాలు జారీ చేయగా.. దీనిపై ప్రస్తుతం ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. అయితే ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి విచారణ జరుగుతున్న నేపథ్యంలో తక్ష ణమే ట్రైబ్యునల్ తీర్పును నోటిఫై చేయాలని మహారాష్ట్ర, కర్ణాటక కేంద్రాన్ని కోరుతున్న విషయం విదితమే. దాంతో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో ఈ నెల 7న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి భేటీ కానున్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం ఏకాభిప్రాయం కుదిరితే.. తీర్పును కేంద్రం నోటిఫై చేయనుంది. ఆ వెంటనే బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు అమలు కానున్నాయి.

## కులగణన చారిత్రక అవసరం : జస్టిస్ ఎన్‌వీ రమణ



**అమరావతి, మే 1 (జనస్వరం) :** జనగణనలో కులగణన చారిత్రక అవసరమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. కులగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గురువారం ఒక ప్రకటనలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. కులం, కులం ఆధారిత వివక్ష ఒక కఠినమైన వాస్తవమని, చాలా కాలంపాటు మనం ఈ వాస్తవాన్ని అంగీకరించకుండా విస్మరించడానికే ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఇప్పుడు చైతన్యంతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. కులాన్ని ఒక గుర్తింపుగా తీసుకొని జనగణనలో కులగణన నిర్వహించడం సరైన దిశలో వేసిన సాహసోపేతమైన అడుగు అని అభివర్ణించారు. సమాజంలోని అన్ని వర్గాలకు అధికారంలో, ఆర్థికాభివృద్ధిలో తగిన వాటా లభించేలా చేయడంలో కులగణన తోడ్పడుతుందన్నారు. జనగణనలో ప్రతి సామాజిక సూచికను పరిగణనలోకి తీసుకోవాలని, ఇది సామూహిక ప్రయోజనాన్ని లక్ష్యంగా చేసుకున్న సమగ్ర వినియోగ ప్రక్రియగా మారాలని ఆకాంక్షించారు.